ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

శనివారం 19 జూలై 2025

నేలరాలని చినుకు..!

ఎండుతున్న వేరుశనగ పంట




నేలమ్మపై వాన దేవుడు అలిగాడేమో..! మబ్బుల్లో దాక్కుని దిగిరాకున్నాడు. పంట సాగుకు అదును దాటిపోతోందని అన్నదాతలు ఆత్రంగా వేడుకుంటున్నా బెట్టు వీడకున్నాడు. ఇది చాలదన్నట్లు గాలిదేవుడు ఆగొ మేఘాలపై దూరంగా లాక్కుపోతున్నాడు. మురిపించిన ముందస్తు వర్షాలకు ఖరీఫ్ సాగుకు సిద్ధమైన రైతు.. చినుకు నేల రాలక ఇప్పుడు ఉసూరుమంటున్నాడు. అదును దాటినా పదును వాన లేక.. ఇంట్లో విత్తనాలను అమ్మక తప్పదేమోనని ఆవేదన చెందుతున్నాడు. ఇప్పటికే అక్కడక్కడ సాగైన వేరుశనగ వాడిపోతోంది. ఈ ఏడాదీ నష్టాలు తప్పేలా లేవు. ఇకనైనా వాన కురిస్తే.. ప్రత్యామ్నాయ పంటలైనా సాగవుతాయి.

6లో

నీళ్లు వచ్చేశాయ్

జిల్లా సరిహద్దులో హెచ్చెల్సీకి నీటి విడుదల

బొమ్మనహాళ్, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోకి తుంగభద్ర జలాశయం నుంచి నీరు హెచ్చెల్సీ ద్వారా వచ్చేసింది. మండలంలోని ఎగువ కాలువలో అత్యవసర మరమ్మతు పనులు జరుగుతున్న నేపథ్యంలో 105 కి.మీ. వద్ద ఆంధ్రలోకి నీరు రాకుండా గేట్లు వేసిన విషయం తెలిసిందే. అయితే పనులు కొంతవరకూ పూర్తి కావడంతో శుక్రవారం మధ్యాహ్నం సరిహద్దులో దింపిన గేట్లను హెచ్చెల్సీ అధికా రులు ఎత్తి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం సరిహద్దులో 300 క్యూసెక్కులు నీరు వస్తున్నాయి. ఆంధ్ర వాటాను తుంగభద్ర జలాశయం నుంచి గురువారం విడుదల చేశారు. 500 క్యూసెక్కులు విడుదల చేశారు. ప్రస్తుతం సరిహద్దులో 300 క్యూసెక్కులు వస్తున్నాయి. నీటిని విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆనందంతో సేద్యం పనులను ముమ్మరం చేశారు.



సరిహద్దులో గేట్లు ఎత్తడంతో వస్తున్న తుంగభద్ర జలాలు

న్యాయ విద్యకు అన్యాయం..!

• ఎస్కేయూ లా కాలేజీలో వేధిస్తున్న ఫ్యాకల్టీ కొరత • హెచ్ఓడీ ఒక్కరే రెగ్యులర్ ప్రొఫెసర్

ఏళ్లు గడుస్తున్నా పోస్టుల భర్తీ శూన్యం

అకడమిక్ కన్సల్టెంట్లతో నెట్టుకొస్తున్న వైనం

అడుగు ముందుకు పడని కళాశాల అభివృద్ధి

అనంతపురం రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని లా కాలేజీకి ఎంతో పేరుంది. కళాశాల ఏర్పాటు చేసి అర శతాబ్దం దాటింది. అభివృద్ధి మాత్రం అడుగు ముందుకు పడలేదు. నేటికీ సీట్లన్నీ ఫుల్ అవుతున్నాయి. కాలేజీలో సీటు దక్కడం గగనంగా మారింది. అయినా, పాఠాలు చెప్పేవారు లేరు. అంత ప్రతిష్ఠాత్మక కాలేజీలో విభాగాధిపతి మాత్రమే రెగ్యులర్ ఫ్యాకల్టీ. మిగతా అందరూ అకడమిక్ కన్సల్టెంట్లే. 15 ఏళ్లుగా ఒక్కటంటే ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదు. రెగ్యులర్ ఫ్యాకల్టీ లేక బోధన కరువైంది. ఇప్పటికైనా రెగ్యులర్ ఫ్యాకల్టీని నియమించాలనీ, కళాశాలను అభివృద్ధి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

వేధిస్తున్న ఫ్యాకల్టీ కొరత

న్యాయ విద్యకు ఆదరణ పెరుగుతోంది. లా చదివేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నారు. ఎస్కేయూలోని లా కాలేజీలో సీట్లన్నీ భర్తీ అవుతుండడమే ఇందుకు నిదర్శనం. అలాంటి విభాగానికి గ్రహణం పట్టుకుంది. రెగ్యులర్ ఫ్యాకల్టీ లేరు. అకడమిక్ కన్సల్టెంట్లతోనే నెట్టుకొస్తున్నారు. విచిత్రమేమిటంటే.. వారు కూడా పూర్వ విద్యార్థులే. ఎస్కేయూలో లా విభాగం 1973లో ప్రారంభమైంది. బ్యాచ్‌లర్ ఆఫ్ లా(బీఎల్), మాస్టర్ ఆఫ్ లా(ఎంఎల్) రెండు కోర్సులున్నాయి. డిగ్రీ పూర్తయిన వారు బీఎల్ చేయడానికి అర్హులు. బీఎల్ పూర్తయినవారు ఎంఎల్ చేయవచ్చు. ఏటా ఈ కోర్సులో చేరేందుకు తీవ్ర పోటీ నెలకొంటోంది. బీఎల్‌లో 60 సీట్లు ఉంటే.. అన్నీ భర్తీ అవుతున్నాయి. వారికి పాఠాలు చెప్పేందుకు రెగ్యులర్ ఫ్యాకల్టీ లేకపోవడం సమస్యగా మారింది. విభాగంలో ముగ్గురు చొప్పున ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఆరుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు ఉండాలి. ప్రస్తుతం ఒక్కరు మాత్రమే రెగ్యులర్ ప్రొఫెసర్ ఉన్నారు. ఆయన కూడా 2010లో జరిగిన అధ్యాపకుల భర్తీలో నియమితులైనవారే. ఆయన నియామకమే ఆ విభాగంలో చివరిది కావడం గమనార్హం. ఆ తరువాత ఒక్క పోస్టు కూడా భర్తీ కాలేదు.



ఎస్కేయూలోని న్యాయ విభాగం

అర శతాబ్దిగా అంతే..

ఎస్కేయూ లా కళాశాలను ఏర్పాటుచేసి అర శతాబ్దకాలం దాటిపోయింది. అయినా కళాశాల ఏమాత్రం అభివృద్ధికి నోచుకోవట్లేదు. కళాశాల ఏర్పాటు సందర్భంగా నియమించిన ఫ్యాకల్టీ అందరూ ఉద్యోగ విరమణ చేశారు. ఆ తర్వాత కొత్తగా వచ్చిన వారేలేరు. ఇక్కడ న్యాయ విద్య చదివిన ఎంతోమంది విద్యార్థులు హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో న్యాయవాదులుగా రాణిస్తున్నారు. కళాశాల అభివృద్ధి మాత్రం అడుగు కూడా ముందుకు పడట్లేదు. ప్రైవేటు లా కళాశాలలు మాత్రం విపరీతంగా అభివృద్ధి చెందుతున్నాయి. పేదల విద్యార్థులకు వరమైన ప్రభుత్వ లా కళాశాలను ఎవ్వరూ పట్టించుకున్న పాపాన పోలేదని పూర్వ విద్యార్థులు పెదవి విరుస్తున్నారు.

అకడమిక్ కన్సల్టెంట్లే దిక్కు

లా విభాగంలో రెగ్యులర్ ప్రొఫెసర్‌తోపాటు మరో ఎనిమిది మంది అకడమిక్ కన్సల్టెంట్లు పనిచేస్తున్నారు. వీరు వారానికి 16 గంటలు బోధనలు చేస్తున్నారు. రెగ్యులర్ ఫ్యాకల్టీ లేకపోవడం విభాగానికి వెలితిగా మారిందన్న వాదనలు సంబంధిత వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. 2018లో టీడీపీ హయాంలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడినా.. భర్తీ చేయలేదు. 2023లో వైసీపీ హయాంలోనూ ఎన్నికల ముందు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ రెండు సందర్భాల్లోనూ కొంతమంది పోస్టుల భర్తీపై కోర్టులను ఆశ్రయించడంతో అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఆ ప్రభావం బోధనపై పడుతోంది. పోస్టులను భర్తీ చేస్తే బోధన మెరుగు పడుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రతిపాదనలు పంపుతున్నాం



రెగ్యులర్ ఫ్యాకల్టీ నియామకాలకు ప్రతిపాదనలు పంపుతున్నాం. పదిహేనేళ్లుగా చేపట్టలేదు. అకడమిక్ ఫ్యాకల్టీతో బోధన సాగిస్తున్నాం. రెగ్యులర్ ఫ్యాకల్టీని నియమిస్తే బోధన ప్రక్రియ మరింత మెరుగు పడే ఆస్కారం ఉంటుంది.

- డాక్టర్ శ్రీరాములు, న్యాయశాస్త్ర విభాగాధిపతి, ఎస్కేయూ

చెత్తను క్లియర్ చేస్తాం

- డంపింగ్ యార్డు స్థలంలో పార్కు ఏర్పాటు చేస్తాం
- రూ.736 కోట్లతో ఇంటింటికీ కొళాయి
- పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ
- అనంతలో బయోమైనింగ్ యూనిట్ ప్రారంభం



డంపింగ్ యార్డులో కలెక్టర్, ఎమ్మెల్యేతో కలిసి పర్యటిస్తున్న మంత్రి నారాయణ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): బయోమైనింగ్ యూనిట్ ద్వారా డంపింగ్ యార్డులో ఉన్న చెత్త మొత్తం క్లియర్ అవుతుందని పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. తద్వారా ఏర్పడే ఖాళీ స్థలంలో పార్కు ఏర్పాటు చేస్తామని తెలిపారు. నగర శివారులోని గుత్తి రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డులో బయోమైనింగ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను కలెక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, అనంతపురం కార్పొరేషన్, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం, గుత్తి, కళ్యాణదుర్గం మున్సిపాలిటీల్లో ప్రతి ఇంటికీ కొళాయిని ఏర్పాటు చేసి అమృత్ పథకం ద్వారా తాగునీరు అందిస్తామని అన్నారు. ఇందుకు రూ.736 కోట్లు

(మిగతా 6లో..)

ఓపీఎస్‌తోనే న్యాయం

● డీఎస్సీ- 2003 టీచర్ల డిమాండ్ ● కలెక్టరేట్ వద్ద నిరసన (6లో..)

పెద్దారెడ్డి గృహనిర్బంధం

తాడిపత్రికి రానివ్వని పోలీసులు

ఉద్రిక్తత నడుమ వైసీపీ సమావేశం

తాడిపత్రి/యల్లనూరు, జూలై18(ఆంధ్రజ్యోతి): 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' పేరుతో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రికి తీసుకువెళ్లాలని భావించిన వైసీపీ నేతల ఎత్తుగడలు ఫలించలేదు. అతను తప్ప ఎవరైనా తాడిపత్రిలోకి రావచ్చని అల్టిమేటం జారీ చేసిన మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తన పంతాన్ని నెగ్గించుకున్నారు. ఈ క్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి నేతృత్వంలో శుక్రవారం చేపట్టిన కార్యక్రమం తూతూ మంత్రంగా తయారైంది.2 ఇదే క్రమంలో తాడిపత్రి, తిమ్మంపల్లిలో ఉద్రిక్తతకు తావిచ్చింది. తాడిపత్రిలో వైసీపీ పాత కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ మంత్రి సాకే శైలజనాథ్, కొందరు ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వంపై విమర్శలు చేసి, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్థానిక నాయకులకు దిశానిర్దేశం చేశారు. సమావేశానికి పెద్దారెడ్డి కోడలు హర్షితారెడ్డి హాజరుకావడంతో జేసీ ప్రభాకర్‌రెడ్డి శిబిరంలో తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. వైసీపీ సమావేశం వద్దకు వెళ్లేందుకు జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆయన అనుచరులతో బయలుదేరరారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. హర్షితా రెడ్డిని పంపించేస్తామని హామీ ఇచ్చారు. కాసేపటి తరువాత ఆమెను పంపించారు. దీంతో ఉద్రిక్తత తగ్గింది.



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న పెద్దారెడ్డి

తిమ్మంపల్లిలో టెన్షన్

కార్యక్రమంలో పాల్గొనేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జి కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రయత్నించారు. తన స్వగ్రామం తిమ్మంపల్లి నుంచి ఆయన బయలుదేరేందుకు సిద్ధమవుతుండగా, పోలీసులు అడ్డుకున్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని గృహ నిర్బంధం చేశారు. తాడిపత్రి రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ సత్యబాబు, పలువురు ఎస్ఐలు తిమ్మంపల్లికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ క్రమంలో పోలీసులు, పెద్దారెడ్డి అనుచరుల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. తనను తాడిపత్రికి అనుమతించకపోతే ఇకపై యల్లనూరు పోలీస్ స్టేషన్‌లోనే ఉంటానని పెద్దారెడ్డి హెచ్చరించారు.

(మరిన్ని వివరాలు మెయిన్‌లో..)

పట్టు చీర పెట్టండి..!

● బదిలీపై వెళ్లిన ఓ సూపర్‌వైజర్ ఆర్డర్

● చందాలు వేసుకుని కానుకలు కొన్న అంగన్‌వాడీలు



ఐసీడీఎస్ కంబదూరు ప్రాజెక్టు కార్యాలయం



కళ్యాణదుర్గం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా బదిలీపై వెళ్తున్న అధికారులకు అభిమానంతో కింది స్థాయి సిబ్బంది సన్మానం చేసి, కానుకలు ఇవ్వడం సహజం. కానీ బలవంతంగా సన్మానం, కానుకలు డిమాండ్ చేయడం కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఓ అధికారికే చెల్లింది. ఇటీవల ట్రాన్స్‌ఫర్ అయిన ఓ సూపర్‌వైజర్ బరితెగించి 'బదిలీపై వెళ్లాను. ఓ మంచి పట్టుచీర పెట్టండి' అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలను వేధిస్తున్నారు. బదిలీపై వెళ్లినా కానుకలు ఇవ్వాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలకు హుకుం జారీ చేశారు. ఈ విషయం ఆ నోట ఈ నోట పడి చర్చనీయాంశంగా మారింది.

అంగన్‌వాడీ కార్యకర్తలతో రూ.200 వసూలు

మేడమ్ ఆర్డర్ మేరకు పట్టుచీర కొనడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు ఒక్కొక్కరితో రూ.200, ఆయాలతో రూ.100 వసూళ్లు చేసినట్లు సమాచారం. ఆ సూపర్‌వైజర్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు...ఇలా అందరితోను డబ్బులను వసూలు చేశారు. ఆ వసూలైన డబ్బులతో ఇప్పటికే పట్టుచీర, మరి కొన్ని కానుకలను కొనుగోలు చేసినట్లు తెలిసింది. అంగన్‌వాడీ కార్యకర్తలందరూ కలిసి సన్మానం చేసి, ఈ కానుకలను ఇవ్వడానికి సిద్ధం అయ్యారు. బదిలీపై వెళ్లినా తమకు ఎందుకు ఈ వేధింపులు అంటూ కొంతమంది అంగన్‌వాడీ కార్యకర్తలు బహిరంగంగానే సూపర్‌వైజర్ తీరును విమర్శిస్తున్నారు. పైగా తమ ఊరికే వచ్చి కానుకలు ఇవ్వాలని అల్టిమేటం జారీ చేయడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇవన్నీ మామూలేనా..?

కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టులో కానుకలు ఇచ్చుకోవడం, అందినకాడికి దోచుకోవడం మామూలే అనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. వైసీపీ పాలనలో ఈ ప్రాజెక్టు పరిధిలో సాగిన అవినీతిని నేటికీ కథలు కథలుగా చెబుతారు. గతంలో ఇక్కడ పని చేసిన అధికారులపై అవినీతి విచారణ జరిగినప్పటికీ, చర్యలు మాత్రం లేవు. ఇలాంటి ఘన చరిత్ర ఉన్న ప్రాజెక్టు పరిధిలో ఓ సూపర్‌వైజర్ పట్టు చీర , కానుకలు డిమాండ్ చేయడం పెద్ద విషయం కాదని పలువురు వ్యంగంగా విమర్శిస్తున్నారు.

ఆత్మరక్షణలో దీపిక వర్గం

- బలనిరూపణ కోసం చిలమత్తూరులో సమావేశం
- పురంలో కొండూరు వేణుగోపాల్‌రెడ్డి ప్రెస్‌మీట్
- సస్పెండ్ అయినవారితోనే ప్రజాప్రతినిధులు
- వైసీపీలో కలకలం రేపుతున్న పరిణామాలు



చిలమత్తూరు సమావేశంలో పాల్గొన్న వైసీపీ పురం సమన్వయకర్త దీపిక, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, చౌళూరు మధుమతి తదితరులు

హిందూపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ నుంచి ఇద్దరు ముఖ్య నాయకులను ఒకేసారి సస్పెండ్ చేయడంతో దీపిక వర్గం ఆత్మరక్షణలో పడింది. దీన్నుంచి బయటపడేందుకు బలనిరూపణకు సిద్ధమౌతోంది. సస్పెన్షన్‌లపై నవీన్ నిశ్చల్, కొండూరు వేణుగోపాల్ రెడ్డి స్పందించారు. తమపై చర్యల వెనుక కుట్ర ఉందని ఆరోపించారు. పార్టీ కోసం కష్టపడినందుకు ఇచ్చిన బహుమతి సస్పెన్షన్ అని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదిలోపు స్థానిక ఎన్నికలు ఉన్నాయి. ఈ తరుణంలో తాజా పరిణామాలు వైసీపీలో కలవరం పుట్టిస్తున్నాయి. దీపిక వర్గాన్ని టార్గెట్ చేసి, నియోజకవర్గంలో వారికి బలం లేదని నిరూపించేందుకు నవీన్ నిశ్చల్, కొండూరు వేణు వర్గాలు ప్రయత్నాలు ప్రారంభించాయి. దీంతో మునుముందు తమ పార్టీలో రాజకీయం రసవత్తరంగా ఉంటుందని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీని బలోపేతం చేయడంపోయి బలహీనపరుచుకోవడం ఏమిటని వైసీపీ నాయకులే బహిరంగ విమర్శలు గుప్పిస్తున్నారు.

చిలమత్తూరులో దీపిక సమావేశం

వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, ఆమె భర్త వేణురెడ్డి ఉన్నట్లుండి చిలమత్తూరులో శుక్రవారం వైసీపీ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. మండల స్థాయి సమావేశం అని చెప్పినా, నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న నాయకులను పిలిపించారు. లేపాక్షి, హిందూపురంలో కూడా ఇలాంటి సమావేశాలు ఏర్పాటు చేస్తామని దీపిక వర్గం అంటోంది. ఇద్దరు కీలక నాయకులను సస్పెండ్ (మిగతా 6లో..)

యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యం

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగ అవకాశాలు చూపడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద 20కి పైగా మల్టీనేషనల్ కంపెనీలతో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. సుమారు 600 మందికి పైగా నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో 280 మందికిపైగా వివిధ కంపెనీలలో ఉద్యోగ అర్హత సాధించారు. వారందరికీ ఆయా కంపెనీల ప్రతినిధులు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గ ప్రాంతంలో ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి, ఆర్థిక భద్రతను కల్పించడమే తన మొదటి కర్తవ్యమన్నారు. అందుకోసమే ప్రతిసారి మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహిస్తామన్నారు.



ఇంటర్వ్యూలకు వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

అమ్మా.. ఇక నీ కొడుకు లేడమ్మా..!

తల్లితో మాట్లాడుతూ ఆత్మహత్య



వివరాలు 7లో..

భూసార పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

● జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ



భూసార పరీక్షను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు పక్కాగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. స్థానిక అనంతపురం భూసార పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఎన్‌పీకే, సూక్ష్మపోషకాల పరీక్ష పద్ధతులపై ఆరా తీశారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటిదాకా వచ్చిన మట్టి నమూనాలు, చేసిన పరీక్షలు తదితర వివరాలు ఆరాతీశారు. అందుకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఈ ఏడాది జిల్లాకు 25,107 భూసార పరీక్షలు చేయాలని లక్ష్యం విధించగా.. ఇప్పటి దాకా 7,236 మట్టి నమూనాలు పరీక్షా కేంద్రానికి వచ్చాయనీ, వీటిలో 4,917 పరీక్షలు పూర్తి చేశామని భూసార పరీక్షాకేంద్రం ఏడీఏ రోజాపుష్పలత వివరించారు. లక్ష్యం మేరకు భూసార పరీక్షలు నిర్వహించి, ఆన్‌లైన్‌లో వాటి ఫలితాలను నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓలు శ్రీనాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఉమామహేశ్వరి, మెహరున్నీషా బేగం, కృష్ణకుమారి, నివేదిత, ఏఈఓ గంగుప్ప పాల్గొన్నారు.

భూసార పరీక్షాకేంద్రానికి ఎన్‌ఏబీఎల్ అక్రెడిటేషన్

కేంద్ర ప్రభుత్వ క్వాలిటీ కంట్రోల్ విభాగానికి చెందిన నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఆఫ్ టెస్టింగ్, క్యాలిబ్రేషన్ లేబొరేటరీస్ (ఎన్‌ఏబీఎల్) నుంచి అనంత భూసార పరీక్షా కేంద్రానికి అక్రెడిటేషన్ వచ్చినట్లు జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. భూసార పరీక్షా కేంద్రం తనిఖీకి వచ్చిన ఆమెకు ఏడీఏ రోజా పుష్పలత అక్రెడిటేషన్‌ను అందజేశారు. మూడేళ్లపాటు ఈ గుర్తింపు ఉంటుందన్నారు. మట్టి సేకరణ, వాటి ద్వారా స్థూల, సూక్ష్మపోషకాల శాతం తెలుసుకునేందుకు 12 రకాల పరీక్షలు నిర్వహించడం, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, ఫలితాలను సకాలంలో రైతులకు అందించడం.. లక్ష్యం మేరకు భూసార పరీక్షలు నిర్వహించడం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, అక్రెడిటేషన్ ఇచ్చినట్లు వివరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే షాపులు సీజ్

విద్యాసంస్థల సమీపాన పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కేసులు

ఎస్పీ రత్న హెచ్చరిక



పాఠశాల సమీపంలోని షాపులో తనిఖీ చేస్తున్న పోలీసులు

పుట్టపర్తి రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే షాపులను సీజ్ చేస్తామని ఎస్పీ రత్న హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో ఉన్న షాపుల్లో సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తులను విక్రయించడం నిషేధమన్నారు. ఆ మేరకు విద్యాసంస్థల సమీపంలోని షాపుల్లో తనిఖీలు చేయాలని పోలీసులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే దుకాణాలను సీజ్ చేసి, యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా పోలీసులు.. దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు.

రేపటి నుంచి మస్తాన్‌వలి ఉరుసు



మస్తాన్ వలి దర్గా

గుంతకల్లుటౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత గుంతకల్లులో వెలసిన హజరత్ సయ్యద్ మస్తాన్ వలి స్వామి 390వ ఉరుసు ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉరుసు ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ రహీం తెలిపారు. ఆదివారం గంధం, సోమవారం షంషీర్, మంగళవారం జియారత్ కార్యక్రమం నిర్వహిస్తారు. ఉరుసు ఉత్సవాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఉరుసు ఉత్సవాలకు వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం, దర్గా ఆవరణలో షామియానాలు, విద్యుత్ కోసం జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తాగునీటి ట్యాంకర్లను అందుబాటులో ఉంచారు. మొబైల్ టాయిలెట్లను సిద్ధం చేశారు. దర్గాను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. దర్గా ఆవరణంలో 24 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గంధం, షంషీర్ రోజు భక్తుల సౌకర్యార్థం వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఓపీఎస్‌తోనే న్యాయం

● 2003 డీఎస్సీ టీచర్ల డిమాండ్ ● కలెక్టరేట్ వద్ద నిరసన
● సంఘీభావం తెలిపిన ఉపాధ్యాయ సంఘాలు

అనంతపురం విద్య, జూలై18(ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానా(ఎపీఎస్)ను వర్తింపజేసి, న్యాయం చేయాలని 2003 డీఎస్సీ టీచర్లు డిమాండ్ చేశారు. ఓపీఎస్ అమలు కోరుతూ 2003 డీఎస్సీ టీచర్ల ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఫోరం నాయకుడు మధుప్రసాద్ మాట్లాడుతూ.. ఓపీఎస్ అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం మెమో 57ను జారీచేసిందన్నారు. దాదాపు 16 రాష్ట్రాల్లో ఆ మేరకు అమలు చేశారన్నారు. ఏపీలో కూడా అమలుచేయాలని కోరారు. రాష్ట్రంలో నూతన పెన్షన్ (సీపీఎస్) అమలుకు ముందే నోటిఫికేషన్ వచ్చిందన్నారు. నియామకాల ప్రక్రియ వివిధ కారణాలతో అప్పట్లో ఆలస్యమైందన్నారు. సీపీఎస్ జీఓ వచ్చిన తర్వాత విధుల్లో చేరామంటూ తమకు పాత పెన్షన్ వర్తింపజేయకపోవడం అన్యాయమన్నారు. ఓపీఎస్‌తో న్యాయం చేయాలని కోరారు. మధ్యాహ్నం వరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. నిరసనకు ఉపాధ్యాయసంఘాల నేతలు శ్రీనివాసనాయక్, పాపిరెడ్డి, సిరాజుద్దీన్, వెంకటేష్, రమణారెడ్డి, రామాంజనేయులు, వెంకటరత్నం, గోపాల్‌రెడ్డి, గోవిందు, లింగమయ్య, శివానందరెడ్డి, ఎర్రిస్వామి, అక్కులప్ప, పురుషోత్తంరెడ్డి, రవీంద్రనాయక్, శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. నిరసనలో 2003 డీఎస్సీ ఫోరం నాయకులు మారుతి, నాగభూషణ, ఎర్రిస్వామి, సాయినాథ్‌రెడ్డి, ప్రసన్నలక్ష్మి, వరదరాజులు, నాగేంద్ర, చంద్ర, సుదర్శన్ తోపాటు వందలాది మంది టీచర్లు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌వద్ద ఆందోళన చేస్తున్న 2003 డీఎస్సీ టీచర్లు

చెత్తను క్లియర్ చేస్తాం

(5వ పేజీ తరువాయి)

వెచ్చిస్తామని తెలిపారు. పాతూరు మార్కెట్‌ను వేరే చోటుకు తరలిస్తామని అన్నారు. అనంతలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు మరికొంత సమయం పడుతుందని అన్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు త్వరలో శుభవార్త చెబుతామని అన్నారు. బయోమైనింగ్ ద్వారా వైసీపీ ప్రభుత్వం నిల్వ చేసిన 1.65 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేస్తామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. తద్వారా చెత్త రహిత అనంతను తీర్చిదిద్దుతామని అన్నారు. అక్టోబరు 2 నాటికి డంపింగ్ యార్డులో చెత్త లేకుండా చేస్తామని, 12.6 ఎకరాల్లో పార్కు ఏర్పాటు చేస్తామని అన్నారు. దీనికోసం స్పెషల్ గ్రాంట్ విడుదల చేయాలని మంత్రిని కోరారు. అనంతరం కార్పొరేషన్‌లో రూ.1.7కోట్ల సాధారణ నిధులతో రోడ్లు, మురుగు కాలవల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. లెగసీ డంప్ యార్డును పరిశీలించిన మంత్రి, అక్కడ మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు వైస్ చైర్మన్ వెంకట శివుడు యాదవ్, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ పావని, టీడీపీ నాయకులు ఆదినారాయణ, ఆదెన్న, సింగవరం రవి, పరమేష్, నరసింహులు, బుగ్గయ్యచౌదరి, సరిపూటి రమణ, బల్లా పల్లవి, బొమ్మినేని శివ, కార్పొరేటర్ చలివెందుల బాలాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో రోడ్డు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారాయణ, పాల్గొన్న కలెక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే దగ్గుపాటి, టీసీ వరుణ్, వెంకటశివుడు యాదవ్ తదితరులు

ల్యాండ్ బ్యాంక్‌ను గుర్తించండి

సచివాలయ ఉద్యోగులకు త్వరలో ప్రమోషన్‌లు: మంత్రి నారాయణ



సమీక్షిస్తున్న మంత్రి నారాయణ

అనంతపురం కలెక్టరేట్ జూలై 18(ఆంధ్రజ్యోతి): అహుడా పరిధిలో ల్యాండ్ బ్యాంక్‌ను గుర్తించాలని మంత్రి నారాయణ సూచించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌తో కలిసి మంత్రి నారాయణ నగరపాలిక, అహుడా, పబ్లిక్‌హెల్త్ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని మున్సిపాలిటీలను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. ఎంఐజీ లే అవుట్స్‌ను అభివృద్ధి చేసి, ప్రజలకు ప్లాట్లను కేటాయించాలని ఆదేశించారు. నగరం, పట్టణాలకు దగ్గర్లో మంచి భూములను చూడాలని, లే అవుట్స్‌లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. చిన్న మున్సిపాలిటీలలో అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని అన్నారు. కళ్యాణదుర్గం ఎస్సీ కాలనీలలో అభివృద్ధి పనుల కోసం రూ.25 లక్షలను మంజూరు చేస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు సచివాలయ ఉద్యోగులకు గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1కు ప్రమోషన్లను త్వరలో ఇస్తారని తెలిపారు. వారిని డెప్యుటేషన్‌ల ద్వారా నగరపాలికలో నియమించుకోవచ్చని అధికారులకు సూచించారు. అహుడా పరిధిలో మరింత ల్యాండ్ బ్యాంక్‌ను గుర్తిస్తామని కలెక్టర్ అన్నారు. నగరంలో కాపు, బీసీ భవన్ కోసం స్థలాలను కేటాయిస్తామని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇండోర్ స్టేడియంలో మరమ్మతులు, మున్సిపల్ పార్కుల్లో జిమ్ పరికరాలు, సిటీ సర్వీస్ బస్సులు, ప్రభుత్వాసుపత్రి సమీపంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కోరారు. కళ్యాణదుర్గం ఎస్సీ కాలనీలో అభివృద్ధి పనులకు రూ.50 లక్షలు మంజూరు చేయాలని, వాల్మీకి భవనాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సురేంద్రబాబు కోరారు. ఎంఐజీ లే అవుట్స్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలని అహుడా చైర్మన్ టీసీ వరుణ్ కోరారు. సమావేశంలో జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, నగరపాలిక కమిషనర్ బాలస్వామి, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి, ఈఈ ఆదినారాయణ, నగరపాలిక ఈఈ షాకీర్, టిడ్కో ఈఈ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు టీచర్స్ హ్యాండ్‌బుక్స్



టీచర్స్ హ్యాండ్‌బుక్స్‌ను తరలిస్తున్న దృశ్యం

అనంతపురం విద్య, జూలై18(ఆంధ్రజ్యోతి): టీచర్స్ హ్యాండ్ బుక్స్‌ను పాఠశాలలకు శుక్రవారం సరఫరా చేశారు. గతంలో టీచర్లే హ్యాండ్‌బుక్స్ రాసుకుని, పాఠశాలలకు తీసుకెళ్లి పిల్లలకు బోధించేవారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఉపాధ్యాయులందరికీ ఒకే తరహా హ్యాండ్ బుక్స్ ఉండాలని నిర్ణయించారు. ఆ మేరకు ప్రత్యేకంగా హ్యాండ్‌బుక్స్ ముద్రించి, జిల్లాకు పంపారు. అనంత జిల్లాకు 1,729 పాఠశాలలకుగాను 39,569 హ్యాండ్స్ బుక్స్ వచ్చాయి. వాటిని జిల్లాలోని 1,729 పాఠశాలలకు ప్రత్యేక వాహనాల్లో సరఫరా చేసినట్లు డీసీఈబీ సెక్రటరీ గంధం శ్రీనివాసులు తెలిపారు.

అలరించిన శకుని

అనంతపురం టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని లలితకళా పరిషత్‌లో 'శకుని' నాటకాన్ని శుక్రవారం సాయంత్రం ప్రదర్శించారు. అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌తోపాటు డీఆర్‌ఓ మలోల ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అనంత కళాఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయాలని సూచించారు. సమాజంలో ఎంతటి పాశ్చాత్య పోకడలు వస్తున్నప్పటికీ లలితకళా పరిషత్ తరఫున రంగస్థల కళలకు పెద్దపీట వేస్తూ కళాకారులను ప్రోత్సహిస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రదర్శించిన శకుని నాటకంలో కళాకారులు తమదైన శైలిలో నటనా పాఠవాలను ప్రదర్శించి వీక్షకులను అలరింపజేశారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి గాజుల పద్మజ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం అనంతపురం శాఖ ప్రతినిధి శారద, ఎస్కేయూ విశ్రాంత ప్రొఫెసర్ రామగోవింద్ సాగర్, అస్లాం బాషా తదితరులు పాల్గొన్నారు.



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ఆత్మరక్షణలో దీపిక వర్గం

(5వ పేజీ తరువాయి)

చేసినా, పార్టీకి ఎక్కడా ఇబ్బంది లేదని చూపించుకునేందుకు దీపిక వర్గం ఈ ఎత్తులు వేస్తోందని అసమ్మతివర్గం విమర్శిస్తోంది.

వేటు పడినా వెంటే..

నవీన్ నిశ్చల్, కొండూరు వేణు నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైసీపీకి చెందిన వారి వర్గీయులు పాల్గొన్నారు. కర్ణాటక నుంచి దిగుమతి చేసుకున్న మహిళకు టిక్కెట్ ఇచ్చినా పనిచేశామని, అయినా తమ నాయకులపై చర్యలు తీసుకోవడం ఏమిటని వారు నిలదీస్తున్నారు. ఇలా అయితే పార్టీ భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుందని హెచ్చరించారు. పార్టీని నమ్ముకున్న నాయకుల పట్ల ఇలా వ్యవహరించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇద్దరు నాయకులపై పార్టీ చర్యలు తీసుకున్నా.. స్థానిక ప్రజాప్రతినిధులు వారి వెంటనే నిలిచారు. కొండూరు వేణుగోపాల్‌రెడ్డి నిర్వహించిన విలేకరుల సమావేశంలో లేపాక్షి జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ భర్త నారాయణస్వామి, చిలమత్తూరు ఎంపీటీసీ జగన్, రాజారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి హనుమంతరెడ్డి, సాదిక్, సీఏన్‌పీ నాగరాజు, నరసింహారెడ్డి, అశ్వత్థనారాయణ, సలీం, తిప్పన్న, కొంతమంది సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ పరిణామాలు దీపిక వర్గాన్ని కలవరపెడుతున్నాయి.

కష్టపడినందుకు పదోన్నతి: కొండూరు

'మూడు దశాబ్దాలకుపైగా వైఎస్ కుటుంబాన్ని నమ్ముకున్నాను. కాంగ్రెస్, వైసీపీలో కష్టపడి, నష్టపోయినందుకు సస్పెండ్ చేసి పదోన్నతి కల్పించారు' అని వైసీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వెన్నంటే ఉన్నానని, రూ.కోట్లు పోగొట్టుకున్నానని అన్నారు. ఏ రోజూ పదవి అడగలేదని, ఎక్కడా పార్టీ లైన్ దాటలేదని అన్నారు. పార్టీ పెద్దలు ముందుచూపులేకుండా, పార్టీకోసం పనిచేసిన బలమైన నాయకులను సస్పెండ్ చేయడం బాధాకరమని అన్నారు. తనను నమ్ముకున్న కార్యకర్తలు, నాయకుల అభిప్రాయం మేరకే నడుచుకుంటానని అన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటానని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. పార్టీ పెద్దలు పునరాలోచించాలని కోరారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ పురం మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి

నేలరాలని చినుకు..!

సాగుకు నోచుకోని పొలాలు

మరో పక్క ఎండుతున్న పంటలు

అదును దాటుతోందని రైతుల ఆందోళన

అనంతపురం అర్బన్/గుత్తి రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): కార్తెలన్నీ కరిగిపోతున్నాయి.. చినుకు జాడ మాత్రం కానరావడం లేదు. వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్న రైతన్నలకు నిరాశే మిగులుతోంది. మేఘాలు ఊరించి ఉసూరుమనిపిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా సాయంత్రం వేళల్లో ఆకాశం మేఘావృతమవుతున్నా వర్షం పడటం లేదు. ఈ పరిస్థితుల్లో పొలాలు బీడుగా మారాయి. ఈనెలాఖరు దాకా వేరుశనగ విత్తనం వేసుకోవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అప్పటిలోగా పదును వర్షం పడితేనే వేరుశనగ విత్తనం వేసుకునేందుకు అవకాశం ఉంటుంది. లేదంటే ప్రత్యామ్నాయ పంటలే శరణ్యమని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈసారి ముందస్తుగానే నైరుతి రుతుపవనాలు ప్రవేశించినా ఆశించిన స్థాయిలో వానలు పడటం లేదు. అక్కడక్కడా చిరుజల్లులకే పరిమితమైంది. గత ఏడాది మే 29వతేదీ కేరళకు... జూన్ 2వతేదీ జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. ఈ ఏడాది మే 24న కేరళకు... 26న జిల్లాలోకి ప్రవేశించాయి. తర్వాత రెండు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లుల నుంచి ఓ మోస్తారు వర్షం పడింది. అప్పటి నుంచి చినుకు జాడే కనిపించడం లేదు. దీంతో విత్తనం వేసుకోలేని దుస్థితి నెలకొంది.

అరకొరగానే పంటల సాగు

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా సరాసరి సాధారణ సాగు విస్తీర్ణం 3.39 లక్షల హెక్టార్లుగా నిర్ణయించారు. ఇందులో వేరుశనగ 1.82 లక్షల హెక్టార్లు, కంది 55,296, పత్తి 44వేలు, ఆముదం 16,293, వరి 19,466, జొన్న 1719, సజ్జ 2054, మొక్కజొన్న 14,653, రాగి 69, కొర్ర 3,311, పెసలు 455 హెక్టార్లు ఉన్నాయి. మిగతా విస్తీర్ణంలో ఉలవలు, మినుములు, అలసంద తదితర రకాల పంటలు ఉన్నాయి. ఆశించిన స్థాయిలో వానలు పడకపోవడంతో అరకొరగానే పంటలు సాగు ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 47,051 హెక్టార్లల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వేరుశనగ 16,973 హెక్టార్లల్లో మాత్రమే సాగయింది. మిగతా విస్తీర్ణంలో కంది, మొక్కజొన్న, ఆముదం, పత్తి, సజ్జ పంటలు సాగు చేశారు. గుంతకల్లు, గుత్తి, కంబదూరు, బ్రహ్మసముద్రం, కణేకల్లు, ఆత్మకూరు, బొమ్మనహాల్, కుందుర్పి, కూడేరు, రాయదుర్గం, వజ్రకరూరు తదితర మండలాల్లో వేరుశనగ పంట సాగు చేశారు.



వాడుముఖం పట్టిన ఆముదం పంట



సాగుకు సిద్ధంగా ఉన్న పొలం

పూత దశలో పంట.. వర్షం పడితేనే బతికేది

వేరుశనగ పంట ప్రస్తుతం పూత దశలో ఉంది. వేరుశనగ విత్తనం మొలకెత్తిన తర్వాత నుంచి 25 రోజులపాటు పంటకు బెట్టపరిస్థితులు ఉండాలి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వేరుశనగ పంట మొలకెత్తి 30 రోజులు కావస్తోంది. ప్రస్తుతం పూత దశలో పంట ఉంది. పూత దశ నుంచి తప్పనిసరిగా పంటకు తడి అవసరం. ఆ తర్వాత ఊడలు దిగే సమయంలోనూ తడి కావాలి. కీలకమైన పూత దశలో వర్షం పడకపోవడంతో ఎదుగుదల కనిపించడం లేదు. వర్షం పడి ఉంటే పంట పూతతో కళకళలాడుతూ ఉండేది. అవసరమైన సమయంలో వర్షం పడకపోవడంతో పంటంతా వాడుదశకు చేరింది. అరకొర సాగు చేసిన వేరుశనగ పంట వాడుదశకు చేరుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రానున్న నాలుగు రోజుల్లో చిరుజల్లుల నుంచి ఓ మోస్తారు వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ విభాగం ప్రకటించింది. మరోవైపు కంది, ఆముదం, సజ్జ ఇతర పంటలు సాగు చేసిన రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు.



మొలక దశలోనే వాడుముఖం

మృగశిర కార్తెలో ఐదు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. గత నెల 13వతేదీ అరకొర వర్షం వచ్చింది. ఇప్పటి వరకు చినుకు జాడ కనిపించడం లేదు. వేరుశనగ పంట మొలక దశలోనే వాడు ముఖం పట్టింది. ఈ వారంలో వర్షం వస్తేనే పంట బతుకుతుంది. లేదంటే పంటంతా ఎండిపోతుంది. గత ఏడాది వర్షం సరిగా పడకపోవడంతో నష్టపోయా. వర్షం కురిస్తే ఎంతోకొంత దిగుబడి వస్తుంది. లేదంటే ఈసారీ నష్టపోవాల్సిందే. **-భాస్కర్, రైతు, ఊబిచెర్ల, గుత్తి మండలం**

అరకొర వర్షంలోనే పంట సాగు చేశా

ఈసారి అరకొర వర్షంలోనే కంది, సజ్జ పంట సాగు చేశా. గత ఏడాది వేరుశనగ పంట సాగు చేసి నష్టపోయా. అందుకే ఈసారి మూడెకరాల్లో కంది, సజ్జ సాగు చేశా. ఈసారి వర్షాలు వస్తాయని ఆశతో పంటను సాగు చేశాను. నెల రోజుల క్రితం పడిన వర్షం తప్పా.. ఆ తర్వాత చినుకు జాడలేదు. పరిస్థితి ఇలాగే ఉంటే కంది, సజ్జ పంటలు చేతికి అందడం కష్టమే. వరుణదేవుడు కరుణిస్తే గట్టెక్కుతాం. లేదంటే నష్టాలు తప్పవు. **-రంగప్ప, రైతు, బేతాపల్లి, గుత్తి మండలం**



అమ్మా.. ఇక నీ కొడుకు లేడమ్మా..!

తల్లికి వీడియో కాల్.. లైవ్‌లో యువకుడి ఆత్మహత్య



మల్లికార్జున (ఫైల్)

వెళ్లి.. వస్తానని..
అమ్మకే చెప్తివా..
పిచ్చి కన్నా..
తల్లి చూస్తుండగానే
ఉరికి వేలాడితివా..
అమ్మ గుండె
ఎంతగా తల్లడిల్లిందో..
ఒక్కసారైనా ఆలోచిస్తివా..
తల్లి కన్నీళ్లకైనా..
నీ మనసు కరగకపోయెనా..
చేతులెత్తి వేడుకున్నా..
వినకపోతివా..
ఐ లవ్ యూ.. అమ్మా.. అంటూ..
పాణం తీసుకుంటావా..
ఇంతకన్నా..
శిక్ష ఏముంటుంది కన్నా..?



ఆత్మహత్య చేసుకునే సమయంలో వీడియో కాల్‌లో విలపిస్తున్న మల్లికార్జున

బుక్కరాయసముద్రం, జూలై18(ఆంధ్రజ్యో): 'అమ్మా.. ఐ యామ్ వెరీ సారీ.. ఇక నీ కొడుకు లేడమ్మా.. జాగ్రత్తగా ఉండు.. మళ్లీ వస్తాను.. చెల్లి మానస కడుపున పుడతాను. నాకోసం మీరు ఉండాలి. నాన్నకు చెప్పు.. ప్లీజ్ మా... ఐ మిస్ యూ మా... లవ్ యూ మా...' అంటూ తల్లికి వాట్సాప్ మెసేజ్ చేశాడు. ఆ తర్వాత వీడియో కాల్ చేసి, వద్దని వేడుకుంటున్నా.. కళ్ల నీళ్లు పెట్టుకుంటున్నా వినకుండా.. తల్లి చూస్తుండగానే ఉరేసుకుని, మరణించాడు. కొడుకు మరణాన్ని చూసి తల్లి కుప్పకూలిపోయింది. మండలంలోని బొమ్మలాటపల్లి వద్ద బ్రహంగారి గుడి వెనుక గుట్టపై ఉన్న చెట్టుకు ఉరేసుకుని మల్లికార్జున(23) మరణించాడు. నార్పల మండల పులసనూతల గ్రామానికి చెందిన ఆదినారాయణ, మునీశ్వరి దంపతుల ఒక్కగానొక్క కుమారుడు మల్లికార్జున. ఇంటర్ వరకు చదివాడు. అనంతపురంలో కారు డ్రైవింగ్ నేర్చుకుంటుండేవాడు. తాను చనిపోతున్నానని శుక్రవారం తల్లిదండ్రులకు వాట్సాప్ ద్వారా మెసేజ్ పంపాడు. అనంతరం తల్లి మునీశ్వరికి వీడియో కాల్ చేసి లైవ్‌లోనే చెట్టుకు ఉరేసుకుని, చనిపోతున్నానన్నాడు. తల్లి మునీశ్వరి కన్నీరు మున్నీరుగా విలపించింది. 'చనిపోవద్దు.. నాన్నా..' అని ప్రాధేయపడినా వినకుండా ఉరేసుకున్నాడు. దీంతో మునీశ్వరి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. మల్లికార్జున చనిపోయాడు. వెంటనే కుటుంబీకులు.. నార్పల పోలీసులకు సమాచారం అందించారు. ఇంతలోనే చెట్టుకు వేలాడుతున్న యువకుడి మృతదేహాన్ని అటుగా వెళ్తున్న వారు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. నార్పల పోలీసుల సమాచారంతో మృతదేహం మల్లికార్జునదిగా గుర్తించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. దీనిపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

తెగని పంచాయితీ..!

- బదిలీల గడువు ముగిసినా ఖరారు కాని ప్లేస్‌మెంట్స్
- రోజుకో జాబితాతో కలెక్టర్ ఆమోదానికి..
- అంతుబట్టని ముగింపు ప్రక్రియ



అనంతపురం న్యూటౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయంలో గ్రేడ్-5 కార్యదర్శి, గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్ల బదిలీల గడువు ముగిసినా నేటికీ ప్లేస్‌మెంట్స్ ఖరారు కాలేదు. పంచాయతీ అధికారులు రోజుకో జాబితాను కలెక్టర్ ఆమోదానికి పంపుతుండటంతో నే పంచాయితీ ఏర్పడిందన్న ప్రచారం జరుగుతోంది. అధికారులు చేసిన తప్పిదాలకు ప్రజా ప్రతినిధులతోపాటు కలెక్టర్ కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. గడువు ముగిసి 15 రోజులు గడుస్తున్నా బదిలీల జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశాలు కల్పిస్తుండటం వెనుక ముడుపుల బేరం ఉన్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. బదిలీల గడువు ముగిసే నాటికే స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు అధికారులకు అందాయి. అందుకు అనుగుణంగా, మార్పుల్లేని రీతిలో బదిలీల ప్రక్రియ ముగించి ఉంటే ఇన్ని రోజులు ఈ తంతు నడిచేది కాదు. బదిలీల కౌన్సెలింగ్‌ను ఇష్టారాజ్యంగా చేపట్టడంతో నే సమస్యలు ఉత్పన్నమయ్యాయి.

అంతా గందరగోళం

ప్రారంభంలో స్పౌజ్, ఇతర మెడికల్ గ్రౌండ్స్ కింద వచ్చిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించకుండానే ఆప్షన్ ఫామ్స్ తీసుకొని పంపించేశారు. అనంతరం గందరగోళానికి తెరలేపారు. మిగిలిన వారితో సైతం రెక్వెస్ట్ ఫామ్స్ తీసుకొని ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు చేసుకొనే ప్రయత్నం చేశారు. అయితే మంచి ర్యాంకు వచ్చిన అభ్యర్థులు అడ్డు తగిలి నిరసనకు దిగారు. ఇది కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో స్పందించిన ఆయన అధికారులను పిలిపించుకొని గట్టిగానే క్లాస్ పీకినట్లు సమాచారం. దీంతో ర్యాంకుల వారిగా తిరిగి కౌన్సెలింగ్ నిర్వహించారు. సిఫార్సు లేఖలకు అవకాశం లేకుండా చేశారు. అయితే సిఫార్సులకు సంబంధించి స్థానిక నాయకుల నుంచి ఒత్తిళ్లు రావడంతో వాటికి అనుగుణంగా బదిలీల ప్రక్రియను సరిదిద్దారు. ఇది సమస్యగా మారింది. దీనికి తోడు సిఫార్సు లేఖలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం ఆలస్యం కావడంతో మరింతమంది లేఖలు పట్టుకొచ్చారు. ఆఖరికి సిఫార్సు లేఖలు తెచ్చుకొన్న వారికి మాత్రం ఉన్న ఖాళీలకు అనుగుణంగా బదిలీలు చేసి మమా అనిపించారు. సిఫార్సు లేకుండా తమకు ఉన్న సమస్యలను చెప్పుకొని ప్రాధేయపడ్డ వారికి న్యాయం చేయలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. యాడికి మండలంలో పని చేసేవారిని బొమ్మనహాళ్ మండలానికి బదిలీ చేశారు. అక్కడ మ్యూచువల్ ఉన్నారని కుటుంబసభ్యుల ఆరోగ్య పరిస్థితి బాగాలేదదని, తగిన న్యాయం చేయాలని వారం రోజులుగా అధికారుల చుట్టు ప్రదక్షిణలు చేసినా కరుణించలేదు. ఇలా చాలా మంది బాధితులు గా మిగిలిపోయారు. అయితే బదిలీల ప్రక్రియ ఎప్పటికి ముగిస్తారన్నది అంతుబట్టకుండా ఉంది.

సీఎం సమీక్షలో ఎంపీ 'అంబికా'



పాల్గొన్న ఎంపీ అంబికా

అనంతపురం క్రైం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన సమీక్షలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉండవల్లిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, పార్టీ పార్లమెంట్ ఫ్లోర్ లీడర్ లావు కృష్ణదేవరాయలు, ఎంపీలు పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, కేంద్రం నుంచి ఏపీకి సాధించాల్సిన నిధులు, ప్రాజెక్టులు, ప్రజల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాల గురించి పార్లమెంట్‌లో తమ వాణి వినిపించేలా సీఎం దిశానిర్దేశం చేశారని ఎంపీ అంబికా తెలిపారు.

ఐదు రోజులు వానలు

బుక్కరాయసముద్రం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి శుక్రవారం తెలిపారు. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని అన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 34.5 నుంచి 35.7 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25.2 నుంచి 25.4 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చని తెలిపారు. నైరుతి దిశగా గాలులు గంటకు 10కి.మీ. వేగంతో వీస్తాయని, గాలిలో తేమ ఉదయం పూట 73-78, మధ్యాహ్నం 46-52 శాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. అనంతపురం జిల్లాలో 19వ తేదీ 40 మి.మీ., 20న 14 మి.మీ., 21న 10 మి.మీ., 22న 15 మి.మీ., 23న 12 మి.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో 19న 40 మి.మీ., 20న 14 మి.మీ., 21న 10 మి.మీ., 22న 15 మి.మీ., 23న 12మి.మీ. కురిసే అవకాశం ఉందని తెలిపారు.

రేపు ఇంటర్వ్యూలు

అనంతపురం అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): సీడాప్ ఆధ్వర్యంలో మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎల్‌టీడీ సోలార్ ప్రైవేటు సంస్థలో ఉద్యోగ నియామకాలకు ఈనెల 20వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శైలజ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 20న ఉదయం 8.30 గంటలకు అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. నిరుద్యోగ యువకులు సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. సీనియర్ మేనేజర్, మేనేజర్, ప్రాజెక్టు మేనేజర్, సీనియర్ ఇంజనీర్, ఇంజనీర్, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, ఫీల్డ్ ప్లానింగ్ ఆపరేటర్స్, లిజనింగ్ ఎక్విజిషన్, మెయింటెనెన్స్ ఓఅండ్ఎం పోస్టులకు బీటెక్, డిప్లొమా అన్ని బ్రాంచ్‌ల అభ్యర్థులు అర్హులన్నారు. 18 నుంచి 45 సంవత్సరాలోపు వయసు, రెన్యుబుల్ ఎనర్జీ, సోలా ర్ పరిశ్రమలో ఏడాదికిపైగా అనుభవం కలిగి ఉండాలన్నారు. అకౌంట్స్, హెచ్‌ఆర్ పోస్టుల కోసం ఎంబీఏ చేసిన ఏడాదికిపైగా అనుభవం ఉన్న వారు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఉమ్మడి అనంత జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 08554-271122, 8985091256 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపు అరసం అభినందన సభ

అనంతపురం టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ముగ్గురు పురస్కార గ్రహీతలకు ఏపీ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆధ్వర్యంలో అభినందన సభ ఆదివారం నిర్వహిస్తామని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ తస్నీరు నాగేంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లాకు చెందిన సీనియర్ సాహితీవేత్తలు డాక్టర్ శాంతినారాయణకు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వారి ప్రతిభా పురస్కారం, బండి నారాయణస్వామికి డాక్టర్ రావూరి భరద్వాజ స్మారక పురస్కారం, తూంచర్ల రాజారాంకు మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ వారి సాహిత్య విమర్శ పురస్కాలు ఒకే నెలలో ప్రకటించిన సందర్భంగా ఈ అభినందన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అరసం అనంత అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

గూగూడు హుండీ ఆదాయం రూ.31లక్షలు

నార్పల, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూగూడు కుళ్లాయి స్వామి దేవాలయంలో శుక్రవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి రూ.31.3లక్షలు ఆదాయం వచ్చిందని ఈఓ శోభ తెలిపారు.

తిన్నది ఇచ్చేస్తాం.. ఎల్‌పీసీ ఇవ్వండి

- బతిమాలుతున్న బదిలీపై వెళ్లిన హెచ్‌ఎంలు
- కాంప్లెక్స్ నిధులు వెనక్కు ఇచ్చేందుకు తంటాలు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో ప్రకంపనలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం విద్య, జూలై 18(ఆంధ్రజ్యోతి): 'బాబ్బాబు.. పొరపాటైంది. నేను డ్రా చేసుకున్న కాంప్లెక్స్ నిధులు తిరిగి ఇచ్చేస్తా. నాకు ఎల్‌పీసీ ఇవ్వండి' అంటూ బదిలీపై వెళ్లిన హెచ్‌ఎంలు బతిమలాడుతుండటం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మూడు రోజుల కిందట రెండే మీటింగ్‌లు.. రూ.లక్ష డ్రా చేసుకొని వెళ్లారు శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్ర సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు సీరియస్‌గా స్పందించి, విచారణకు ఆదేశించారు. దీంతో డీఈఓ, ఎస్ఎస్ఏ ఏపీసీలు ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో కాన్ఫరెన్స్ నిర్వహించి 'మీరు పెట్టిన బిల్లులు పరిశీలన చేయిస్తామని, అందరూ అన్నీ సిద్ధంగా ఉంచు కోవాలి' అని ఆదేశించారు. దీంతో నిధులు డ్రా చేసుకొని బదిలీపై వెళ్లిన ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలలో ఆందోళన మొదలైంది. కొందరు హెచ్‌ఎంలు ఆ డబ్బును వెనక్కు ఇచ్చి ఎల్‌పీసీ తీసుకొని వెళ్లడానికి సిద్ధమయ్యారు. అనంతపురం రూరల్ మండలం పరిధిలోని ఓకాంప్లెక్స్ హెచ్‌ఎం మరింత దిగొచ్చి తాను డ్రా చేసిన లక్ష రూపాయలు తిరిగిచ్చేస్తా.. ఎల్‌పీసీ ఇమ్మని రాయబారానికి దిగినట్లు సమాచారం. అయినా ఆ పాఠశాల కొత్త హెచ్‌ఎం 'మీరు ఏదో ఖర్చు పెట్టారని బిల్లులు పెట్టారు కదా సార్.. ఇపుడు ఆ లక్ష ఎలా ఇస్తారు? మీకు నష్టం కదా' అని ప్రశ్నిస్తే 'సార్ అదంతా వద్దు. ఇదిగో ఈస్కూల్ కాంప్లెక్స్‌కు వచ్చిన రూ.లక్ష ఇస్తున్నా తీసుకో. నాకెందుకు సమస్యలు. ఎల్‌పీసీ ఒక్కటి ఇస్తే చాలు నేను ప్రశాంతంగా వెళ్లి నా స్కూల్‌లో డ్యూటీ చేసుకుంటా' అని లక్ష రూపాయలు వెనక్కు ఇచ్చేశారట. బొమ్మనహాళ్, కళ్యాణదుర్గం, పుట్లూరు, గుత్తి, గంతకల్లు, రాయదుర్గం, బ్రహ్మసముద్రం, డి. హీరేహాళ్ మండలాల్లో వచ్చిన మొత్తం, ఖర్చుల వివరాలు అన్ని ఇచ్చి ఎల్‌పీసీ కోసం ప్రాధేయపడుతున్నట్లు సమాచారం. ఇంకొందరైతే తమ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలల టీచర్లతో మీకు కాంప్లెక్స్ నిధులతో ఫలానా టీఎల్ఎం మెటీరియల్ ఇచ్చామంటూ సంతకాలు పెట్టించుకొని వెళుతున్నారట. ఇలా కొందరు హెచ్‌ఎంలు కాంప్లెక్స్ గ్రాంట్స్ దోపిడీ నుంచి బయటపడటానికి నానా తంటాలు పడుతున్నారు.

● కాంప్లెక్స్‌లకు మళ్లీ నిధులు... నేడు తొలి సమావేశం

స్కూల్ కాంప్లెక్స్‌లకు ప్రభుత్వం మళ్లీ నిధులు విడుదల చేసింది. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి రాష్ట్ర సమగ్రశిక్ష శాఖ నిధులు మంజూరు చేసింది. ఒక్కో స్కూల్ కాంప్లెక్స్‌కు రూ.28,700లు చొప్పన జిల్లాలో 135కాంప్లెక్స్‌లకు గాను రూ.38.74లక్షలు విడుదల చేశారు. ఈవిద్యా సంవత్సరంలో శనివారం ఈ 135కాంప్లెక్స్ స్కూళ్లలో తొలి సమావేశాలు జరగనున్నాయి.

యూరియా కోసం షరతులు

- ఎరువు కావాలంటే క్రిమిసంహారక మందులు కొనాల్సిందే
- దుకాణదారుల ఆగడాలతో అన్నదాతల అగచాట్లు

కణేకల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): దుకాణదారుల షరతులతో హెచ్చెల్సీ ఆయకట్టు రైతులు అల్లాడిపోతున్నారు. యూరియా కావాలంటే పురుగు మందులు కొనాల్సిందే అని చెబుతుండటంతో తలలు పట్టుకుంటున్నారు. మండలంలో ప్రతి ఏటా దాదాపు 22 వేల ఎకరాల్లో రైతులు వరిపంటను సాగు చేస్తుంటారు. వరి పైరు ఎదుగుదలకు యూరియా చాలా అవసరం. దీంతో ఎరువుల దుకాణదారులు కృత్రిమ కొరత సృష్టిస్తూ ఒక్కో బస్తాపై అదనంగా రూ. 20 వసూలు చేస్తున్నారు. అలాగే అమ్ముడుపోని క్రిమిసంహారక మందులు అంటగడుతున్నారు. మందులు వద్దన్న రైతులకు యూరియా స్టాక్ లేదని బుకాయిస్తున్నారు. తప్పని పరిస్థితులలో రైతులు క్రిమి సంహారక మందులు కూడా కొనుగోలు చేస్తున్నారు. ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో ఎరువుల దుకాణదారులు ఇలాగే వ్యవహరిస్తున్నారని చిన్న, సన్న కారు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠినచర్యలు: ఏఓ జగదీష్

మండలంలో ఎవరైనా ఎరువుల దుకాణదారులు యూరియా కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం, అవసరం లేకున్నా క్రిమిసంహారక మందులు అంటగడితే కఠిన చర్యలు తప్పవు. జూన్ నెల నుంచి ఇప్పటి వరకు మండలానికి 450 టన్నులు యూరియా సరఫరా అయ్యిందన్నారు. అందులో ప్రభుత్వ సొసైటీల ద్వారా ఆధార్‌కార్డ్ ప్రామాణికంగా ఒక్కో రైతుకు ఐదు బస్తాల వరకు యూరియాను అందిస్తామన్నారు. యూరియా కోసం రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు.



యూరియా కోసం క్యూలైన్‌లో నిల్చున్న రైతులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అశోక్(ఫైల్)

గుంతకల్లు టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతకొత్త చెరువు గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వై అశోక్(24) మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు తిలక్ నగర్‌లో నివాసముంటున్న వై.సుబ్బరాయుడు, రామాంజినమ్మ కూరగాయల మార్కెట్‌లో ఆకుకూరల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నారు. వీరి కుమారుడు అశోక్ కూడా తల్లిదండ్రులకు వ్యాపారంలో చేదోడుగా ఉండేవాడు. శుక్రవారం ఉదయం తన స్నేహితుడైన లోకేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై గుత్తికి వెళ్లాడు. తిరిగి గుంతకల్లుకు వస్తుండగా పాతకొత్తచెరువు గ్రామం వద్ద ప్రమాదవశాత్తు అదుపు తప్పి బైకు బోల్తా పడింది. దీంతో అశోక్ ఎగిరి రాయి మీద పడి, అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన లోకేష్‌ను చికిత్స గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లిదండ్రులు, బంధువులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని బోరున విలపించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై ఎలుగుబంటి దాడి



గాయపడిన భూతరాజు

గుడిబండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ రాయాపురం గ్రామ సమీపాన శుక్రవారం పొలంలో పనులు చేసుకుంటున్న యువకుడు భూతరాజుపై ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భూతరాజు ఉదయం తమ పొలానికెళ్లాడు. అటవీ ప్రాంతం పక్కనే ఉన్న పొలంలో పనులు చేసుకుంటుండగా ఒక్కసారిగా ఎలుగుబంటి దాడి చేసింది. తీవ్రంగా గాయపరచింది. భూతరాజు కూడా ప్రతిఘటించాడు. సమీప పొలాల్లోని రైతులు గట్టిగా కేకలు వేయడంతో ఎలుగుబంటి అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. గాయపడ్డ భూతరాజును 108 వాహనంలో మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ బీట్ ఆఫీసర్ మహదేవప్ప గ్రామానికి చేరుకుని, భూతరాజు కుటుంబ సభ్యులతో వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పొలాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భూతరాజును మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పరామర్శించారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణా తరగతులు మళ్లీ వాయిదా

అనంతపురం విద్య, జూలై18(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులు బోధించే టీచర్లకు నిర్వహించ తలపెట్టిన ప్రాథమిక భాష, గణిత నైపుణ్యాలు (ఎఫ్‌ఎల్‌ఎన్) శిక్షణాతరగతులు మళ్లీ వాయిదాపడ్డాయి. ఈనెల 21నుంచి 26వ తేదీ వరకు నిర్వహణకు సమగ్రశిక్ష రాష్ట్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. జిల్లా అధికారులు 5 డివిజన్లలో నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. ఏం జరిగిందో తెలీదు కానీ, శిక్షణా తరగతులను మళ్లీ వాయిదావేస్తూ శుక్రవారం ఎస్పీడీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో శిక్షణాతరగతులు వాయిదా వేసినట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ వెల్లడించారు. ఎప్పుడు నిర్వహించేదీ తర్వాత ప్రకటిస్తామన్నారు. ఈ వాయిదాను టీచర్లు గమనించాలని కోరారు. తొలుత పాఠశాలల ప్రారంభ సమయంలోనే శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. అడ్మిషన్లు, బడిబయట పిల్లల సర్వే, మెగా పీటీఎం కార్యక్రమాల నిర్వహణ నేపథ్యంలో టీచర్ల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో అప్పట్లో శిక్షణను వాయిదా వేసుకున్నారు. ఈనెల 21నుంచి నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టినా.. మళ్లీ వాయిదా వేయడంతో ఉపాధ్యాయ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది.

మార్కెట్‌కు 1018 టన్నుల చీనీ కాయలు

అనంతపురం రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 1018టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు చెప్పారు. అలాగే కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.10,500వేలు పలికినట్లు పేర్కొన్నారు.

ఎస్కేయూలో ఉద్యోగుల బదిలీ

అనంతపురం రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులను వివిధ విభాగాలకు బదిలీ చేశారు. ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు శుక్రవారం బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, మినిమం స్కేల్ ఉద్యోగులు మొత్తం 16 మందికి స్థానచలనం కలిగింది.



బాత్రూంలో పెయింటింగ్ వేస్తున్న ఉద్యోగి

ఇవేం పనులు..!

- ఆర్టీసీ ఉద్యోగులతో బాత్రూంలో పెయింటింగ్ పనులు

ఉరవకొండ, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులతో బాత్రూంలో పనులు చేయించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో ఉన్న బాత్రూంలో ఉద్యోగులతో శుక్రవారం పెయింటింగ్ పనులు చేయించారు. అందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఉద్యోగులతో బాత్రూంలో పనులు చేయించడం బాధాకరమని కార్మిక సంఘాల నాయకులు మండిపడుతున్నారు. డిపోలో పనిచేసే మెకానిక్, పెయింటర్, స్టోర్‌లో పనిచేసే ఉద్యోగులతో బాత్రూంలో పనులు చేయించారు. బయట వ్యక్తులతో శుభ్రం చేయించి, బిల్లులు పెట్టుకోవాల్సి ఉంది. ఆర్టీసీ అధికారులకు ఉద్యోగులు అంటే అలుసు అనీ, అందుకే ఇలాంటి పనులు చేయిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధ్యులైన వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై డిపో మేనేజర్ హంపన్నను అడగ్గా.. బాత్రూంల్లో పెయింటింగ్ చేయించామని అంగీకరించారు.

శభాశ్.. హరీశ్..!

- పాయింట్స్‌మన్‌కు డీఆర్ఎం అభినందన



హరీశ్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో అగ్ని ప్రమాదం విస్తరించకుండా చర్యలు తీసుకున్న పాయింట్స్‌మన్ హరీశ్‌ను డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అభినందించారు. గుంతకల్లులోని రైల్వే డివిజనల్ కార్యాలయానికి రప్పించుకుని, శుక్రవారం ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. శాలువతో సన్మానించి, ప్రశంసాపత్రాన్ని, రివార్డును అందజేశారు. ఈ నెల 14న తిరుపతి స్టేషన్‌లో ఓ ఖాళీ బోగీలో మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. దీన్ని గమనించిన పాయింట్స్‌మన్ హరీశ్, మంటలు వ్యాపించకుండా నిప్పంటుకున్న బోగీని ఇతర బోగీల నుంచి వేరుపరిచారు. రైల్వేకి ఆస్తి నష్టం జరక్కుంగా సమయోచితంగా వ్యవహరించారు. ప్రమాదం జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండటమే కాకుండా ప్రాణాలకు తెగించి, ధైర్యసాహసాలను ప్రదర్శించారని డీఆర్ఎం అభినందించారు.

పెన్షనర్లు ఆర్థిక అవగాహన పెంచుకోవాలి: డీఆర్ఎం

గుంతకల్లు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా రైల్వే ఉద్యోగులు, పెన్షనర్లు ఆర్థిక లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా సూచించారు. డీఆర్ఎం కార్యాలయంలోని రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటరసీ అండ్ సేఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అనే అంశంపై శుక్రవారం అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ డబ్బు వినియోగం విషయంగా డిజిటల్ లావాదేవాల ఆవశ్యకత పెరుగుతున్న కారణంగా రైల్వే ఉద్యోగులు, ముఖ్యంగా పెన్షనర్లు ఫైనాన్స్ ట్రాన్సాక్షన్ విషయంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. పెన్షనర్లు తమ ఫైనల్ సెటిల్మెంట్లను పోస్టాఫీసులోని పొదుపు పథకాల్లోనూ, సీనియర్ సిటిజన్ పొదుపు పథకం (ఎస్‌సీఎస్ఎస్)లో డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. కార్య క్రమంలో రైల్వే బ్రాంచ్ అధికారులు, ఎస్బీఐ ఫైనాన్స్, పర్సనల్ బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో గత నెలలో మరణించిన ముగ్గురు హోంగార్డులకు జిల్లా ఎస్పీ జగదీష్ శుక్రవారం డీపీఓలోని తన చాంబర్‌లో ఆర్థిక సాయం అందించారు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన హోంగార్డు తిరుపాల్ నాయక్ కుటుంబానికి హోంగార్డుల ఒక రోజు వేతనం నుంచీ రూ. 4.32లక్షలు, ఫ్లాగ్ ఫండ్ కింద రూ. 10వేలు, నరసింహులు కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతపురం జిల్లాలో పనిచేస్తూ మరణించిన లక్ష్మిరెడ్డి కుటుంబానికి ఫ్లాగ్ ఫండ్ కింద రూ.10 వేల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పవన్ కుమార్, రాముడు, ఆర్ఎస్ఐ జాఫర్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో పీ4, పీజీఆర్ఎస్, వసతి గృహాల తనిఖీ తదితర అంశాలపై ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు చేర్చాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి బాధ్యతగా పనిచేయాలన్నారు. బంగారు కుటుంబాల ఎంపికపై గ్రామసభలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని వసతి గృహాలను తరచూ తనిఖీ చేసి, విద్యార్థులకు సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయో లేదో పరిశీలించాలన్నారు. ఆర్డీవోలు కూడా పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ పథకాలు, సేవలపై ప్రజలనుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ


ఆస్పత్రి తనిఖీలో డీఎంహెచ్‌ఓ

నార్పల, జూలై18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులను పరిశీలించారు. అలాగే వైద్య సేవల గురించి రోగులనడిగి తెలుసుకున్నారు. రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వైద్యులను, సిబ్బందిని హెచ్చరించారు.

ఘనంగా చిన్నసరిగెత్తు


మకానంలో కొలువుదీరిన పీర్లు

అనంతపురం టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : వేణుగోపాల్ నగరలోని 80 అడుగుల రోడ్డులో నిర్వహిస్తున్న చిన్నపీర్ల పండుగ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం చిన్నసరిగెత్తును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీబీ ఫాతిమా, అల్లావలి, అంగార్‌వలి, ఇమామ్ హుసేన్, ఇమామ్ హుసేన్‌ల పీర్లను వీధుల్లో ఊరేగించారు. భక్తులు దర్శించుకుని చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కందుకూరి నాగరాజు, ఉపాధ్యక్షుడు జెబీవుల్లా ఖాన్, కార్యదర్శి మహ్మద్ రఫీ, సభ్యులు పాల్గొన్నారు.

రేపు మాజీ సైనికుల రాష్ట్రస్థాయి సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల రాష్ట్రస్థాయి సమావేశం ఈనెల 20వ తేదీన ఆర్ట్స్ కాలేజీ డ్రామా హాల్‌లో నిర్వహించనున్నట్లు మాజీ సైనికుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వేశ్వరరావు తెలిపారు. మొట్ట మొదటి సారిగా జిల్లాలో మాజీ సైనికుల రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని, ఉమ్మడి 13జిల్లాల నుంచి మాజీ సైనికులు హాజరవుతున్నారని తెలిపారు. డ్రామాహాల్‌లో ఏర్పాట్లను శుక్రవారం ఆయన అసోసియేషన్ నాయకులతో కలిసి పరిశీలించారు.

పాఠశాలకు బీరువా.. కుర్చీ వితరణ


బీరువా, కుర్చీ అందచేస్తున్న పూర్వ విద్యార్థులు

గార్లదిన్నె, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు శుక్రవారం పూర్వ విద్యార్థులు రూ. 15వేలు విలువ గల బీరువా, కుర్చీని అందజేసి ఔదార్యం చాటుకున్నారు. పాఠశాలలో 2002-2003 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు ఆ వస్తువులను హెచ్‌ఎం సుంకన్నకు అందజేశారు. కార్యక్రమంలో పవన్‌కుమార్‌రెడ్డి, రవి, విజయ్, ఆనంద్, శివ, ప్రతాప్‌రెడ్డి, రవికిరణ్, శ్రీకాంత్‌రెడ్డి, పరమేష్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, ఓబయ్య, శేషుబాబు, ద్వారాకనాథ్, ఆదినారాయణ, అనిల్, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

వీకే ఉద్యమం.. స్ఫూర్తిదాయకం


వీకే స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లాకార్యదర్శి జాఫర్ ఇతర నేతలు

అనంతపురం విద్య, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలకోసం వీకే ఆదినారాయణరెడ్డి చేసిన ఉద్యమాలు బావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచాయని సీపీఐ జిల్లాకార్యదర్శి జాఫర్ కొనియాడారు. వీకే వర్థంతి సందర్భంగా నేషనల్‌పార్క్ వద్ద ఉన్న ఆయన స్థూపం వద్దకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు వెళ్లి ఘననివాళులు అర్పించారు. ఈసందర్భంగా జాఫర్ మాట్లాడుతూ వీకే అడుగుజాడల్లో మనమందరం ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. సీపీఐ నాయకులు సూర్యనారాయణరెడ్డి, శ్రీరాములు, లింగమయ్య, పద్మావతి, రమణ, చిరంజీవి,రాజేష్, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవార్ల దర్శనం


హెచ్చెల్సీ కాలనీలో శాకంబరి అలంకరణలో ముత్యాలమ్మ

అనంతపురంటౌన్, జూలై18(ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు అమ్మవారి ఆలయాల్లో అమ్మవార్లకు శాకంబరి అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో సోమనాథ్‌నగర్ కోదండ రామాలయం, హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయం తదితర ఆలయాల్లో అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు చేయడంతో పాటు కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరిగా అలంకరించి పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆయా ఆలయాల కార్యవర్గాలు, భక్తులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

శింగనమల, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జున రెడ్డి ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1200 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నచోట మరో బూత్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇలా నియోజకవర్గ వ్యాప్తంగా 25 బూత్‌లు కొత్తవాటిని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పులు చేసుకోవచ్చన్నారు. అలాగే కొత్త ఓటర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. అభ్యంతరాలుంటే తెలపాలని రాజకీయ పార్టీ నాయకులను కోరారు. తహసీల్దార్ శేషారెడ్డి, టీడీపీ నాయకులు ఆదినారాయణ, బండిపరుసురాం, పసువుల శ్రీరామిరెడ్డి, వైసీపీ నాయకులు ఎన్‌వీ నారాయణ,నీలం భాస్కర్, బీజేపీ నాయకులు ఓబిరెడ్డి, సీపీఐ నాయకులు చిన్నప్పయాదవ్,మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బోర్‌వెల్ కార్మికుడికి రూ.2.50 లక్షల ఆర్థికసాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు

అనంతపురం క్రైం, జూలై 18(ఆంధ్రజ్యోతి) : నారాయణపురం పంచాయతీలో నివాసం ఉంటున్న బోర్‌వెల్ కార్మికుడు ఆలకుంట రాము ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండడంతో చికిత్సకు ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న వెంకటరమణస్వామి బోర్‌వెల్స్ అసోసియేషన్ నాయకులు ఆర్థిక సాయం అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దమారెప్ప, ఉపాధ్యక్షుడు దళవాయి వెంకట రమణ, ఇతర నేతలు రాము కుటుంబానికి రూ. 2.50 లక్షల నగదును శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాము సమస్యను అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. నాయకులు కదిరప్ప, కిశోర్, రవి, వెంకటేష్ పాల్గొన్నారు.


మురుగు కాలువను మూసివేయకుండా అలాగే ఉంచిన దృశ్యం


కాలువ ఏర్పాటుతో రోడ్డు దాటేందుకు వీలు లేని పరిస్థితి ఇక్కడే..

కాలువ తవ్వారు.. మూసివేయడం మరిచారు

● రోడ్డు, మురుగునీటి అవస్థల్లో శ్రీనగర్ కాలనీ వాసులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై18(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ కాలవ నిర్మాణం కోసం గుంత తీశారు.. అనంతరం దానిని మూసివేయడం మరిచారు. దీంతో అటువైపు ఉన్న రోడ్డులోకి వెళ్లేందుకు వాహనదారులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రామ్‌నగర్ 80అడుగుల రోడ్డు ఎక్స్‌టెన్షన్ నుంచి అయ్యప్పస్వామి ఆలయం వరకు రోడ్డు వేశారు. రోడ్డుకు ఇరువైపులా మురుగుకాలవలు నిర్మించారు. శ్రీనగర్ కాలనీలోకి వెళ్లే వైపు మురుగు కాలవను మూసివేయకుండా అలాగే ఉంచారు. ఆ కాలువ వెడల్పు, లోతుగా ఉండడంతో దాటేందుకు స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక చేసేది లేక ఒక చోట మట్టితో పూడ్చివేసి దాని మీద కాలనీలోకి స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. కాలవను మట్టితో పూడ్చివేయడంతో మురుగునీరు మొత్తం రోడ్డుపైకి వచ్చేస్తోంది. దాని వల్ల తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండడంతో వాహనదారులు, స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. గత ఆరు నెలలుగా ఇదే దుస్థితి నెలకొంది. అంతేగాక కాలవ నిర్మాణం, రోడ్డు వేయడానికి ఉపయోగించిన ఇసుక, రాళ్లు, మట్టి, ఇటుకలతో పాటు ఇతర నిర్మాణ సామాగ్రి రోడ్డు మీద వదిలేశారు. అనంత నగరపాలక సంస్థ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. వెంటనే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన

● ఎమ్మెల్యే పరిటాల సునీత


సుద్దకుంటపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగులో పాల్గొన్న పరిటాల సునీత

రామగిరి, జూలై 18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని సుద్దకుంటపల్లి తండా, సుద్దకుంటపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆమె సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజలకు ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. అలాగే కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక ఒక్క ఏడాదిలోనే అనేక అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించారని చెప్పారు. ఒక్క రామగిరి మండలంలోనే వివిద పథకాల కింద రూ.18కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణాలు చేపట్టామన్నారు. రానున్న నాలుగేళ్లలో అన్ని చెరువులకు నీరందించడంతో పాటు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని పేర్కొన్నారు. తర్వాత రామగిరిలోగల కేజీబీవీలో రూ.1.60 కోట్ల వ్యయంతో తలపెట్టిన అదనపు భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. పాఠశాలలోని అన్నిగదులను పరిశీలించారు. అక్కడున్న ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలనడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామ్మూర్తినాయుడు, రంగయ్య, సుధాకర్, ఆవులముత్యాలు, మారుతీప్రసాద్, శ్రీనివాసులు, ఇటిక నల్లప్ప, పేపర్‌శీన, నాగేశ్‌నాయుడు, విశ్వనాథ్, క్రాంతి, మనోహర, ఎంఈఓ శ్రీనివాసులు, కేజీబీవీ ఎస్‌ఓ సౌమ్యలత తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే తండాల అభివృద్ధి: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, జూలై18(ఆంధ్రజ్యోతి): ఎస్టీ గ్రామాలతో పాటు తండాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. శింగనమల ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎస్టీ గ్రామాలు, తండాల అభివృద్ధిపై చర్చించేందుకు దాత్రి అబా అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో దాత్రి అబా కింద రాష్ట్ర ప్రభుత్వం శింగనమల మండలంలో నాగులగుడ్డం,నాగులగుడ్డంతండాను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు తయారు చేసిందన్నారు. వచ్చే ఏడాదిలో తండాలు, ఎస్టీ గ్రామాలు సమగ్రంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రామాంజనేయులు, తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, ఎంఈఓ నరసింహరాజు.ఏపీఓ భాగ్యలక్ష్మి, ఏపీఎం ఈశ్వరయ్య, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పొగాకు నివారణపై అవగాహన

అనంతపురం వైద్యం, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజేంద్ర మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం పొగాకు నియంత్రణ విభాగం జిల్లా అధికారి శ్రీరాములు పొగాకు నివారణపై అవగాహన కల్పించారు. పొగాకు ఉత్పత్తులను వాడితే కలిగే నష్టాలను వివరించారు. తర్వాత విద్యార్థులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

455 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత

అనంతపురం క్రైం, జూలై 18(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయిజిల్లాలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. మడకశిర మండలకేంద్రంలోని శివాలయం వద్ద శుక్రవారం వారు వాహనాల తనిఖీ చేస్తుండగా కర్ణాటక రాష్ట్రానికి 455 బస్తాల బియ్యం అక్రమంగా రవాణా అవుతున్నట్లు గుర్తించారు. (ఏపీ02-టీబీ-3969) నంబరు గల ఓ వాహనంలో తరలిస్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కర్ణాటకకు చెందిన డ్రైవర్ రాజశేఖర్, పావగడ పట్టణానికి చెందిన బియ్యం యజమాని సేతురాంపై మడకశిర పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. బియ్యాన్ని మడకశిర తహసీల్దార్ ప్రసాద్‌కు స్వాధీనం చేశారు. సీఐ జమాల్ బాషా, డీసీటీఓ సురేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయాలి



పోస్టు కార్డులతో ప్రదర్శన చేస్తున్న రాప్తాడు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

అనంతపురం రూరల్/రాప్తాడు జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదలకు అనేక సేవలందించిన ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయాలని మండలంలోని కురుగుంటలో గల బీఆర్ అంబేడ్కర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు , రాప్తాడులోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు శుక్రవారం పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా విషయాన్ని పోస్టుకార్డుల్లో రాసి కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షాకు పోస్ట్ చేశారు. కార్యక్రమంలో మండల ఆర్డీటీ అభిమానుల సంఘం నాయకులు రాచానపల్లి సుబ్రహ్మణ్యం, ఆంజనేయులు, మన్నీల గోపాల్, తేజ, వెంకటరామడు, వరిమడుగు విక్రమ్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఏపీయూడబ్ల్యూజే వినతి

అనంతపురం కలెక్టరేట్: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ప్రెస్‌క్లబ్ నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య, గౌరవాధ్యక్షుడు భోగేశ్వర్‌రెడ్డి, ఐజేయూ సభ్యుడు శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు దూదేకుల సమావేశం

అనంతపురం వైద్యం, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లా దూదేకుల ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికకు ఈ నెల 20న సమావేశాన్ని నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్, షెక్షావలి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. స్థానిక చమన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించే కార్యక్రమానికి జిల్లాలోని దూదేకుల ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

రేపు బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు ఈనెల 20వతేదీన అనంత క్రీడా గ్రామం (ఆర్డీటీ స్టేడియం)లో నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 2011 సెప్టెంబరు 2వతేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల వారు జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, యూనిఫాం, క్రీడాసామాగ్రితో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 7702889365 ను సంప్రదించాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


కనగానపల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీడీఓ జనార్థన రావు, డీఎల్‌డీఓ శివకుమారి ప్రజలకు సూచించారు. ముక్తాపురం, కనగానపల్లిలలో ఇంటింటా చెత్త సేకరణను శుక్రవారం వారు పరిశీలించారు. ప్రతి రోజు పారిశుధ్య కార్మికులు ఇంటింటా వచ్చి చెత్త సేకరిస్తున్నారా లేదా అని ప్రజలను ఆరా తీశారు. చుట్టూ ఉన్న పరిశరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరి చేరవని తెలిపారు. ఎంపీడీఓ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

రాప్తాడు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే ప్రత్యామ్నాయ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కృష్ణ చైతన్య తెలిపారు. మండలంలోని మరూరు గ్రామంలో శుక్రవారం రైతులకు విత్తన కందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటగా కంది సాగు చేసుకోవడానికి ప్రభుత్వం రైతులకు ఉచితంగా కందులు పంపిణీ చేస్తోందన్నారు. పదును వర్షం కురవగానే రైతులు పొలాల్లో కంది విత్తుకోవాలన్నారు. నెలాఖరు వరకూ కంది సాగు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ కొండప్ప ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సొసైటీ చైర్మన్ మరూరు గోపాల్, కేశవ, సర్పంచ్ తిరుపాలు టీడీపీ నాయకులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వమే శ్రీకృష్ణదేవరాయల జయంతిని నిర్వహించాలి

● మంత్రి నారాయణకు రాయలసీమ బలిజ మహాసంఘం వినతి


మంత్రికి వినతి పత్రం ఇస్తున్న బలిజ సంఘం నాయకులు

అనంతపురం రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వమే శ్రీకృష్ణదేవరాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాయలసీమ బలిజ మహా సంఘం అధ్యక్షుడు శంకరయ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలో రాష్ట్ర పురపాలకశాఖామంత్రి నారాయణను సంఘం నాయకులతో పాటు కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే బలిజ కార్పొరేషన్ ద్వారా బలిజ కల్యాణ మండపం నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు పాములరాయి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు వద్దని..

అనంతపురంరూరల్: తమ గ్రామంలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దని మండలంలోని నరసనాయనికుంట గ్రామస్థులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో పురపాలక శాఖామంత్రి నారాయణను కలిసి వినతి పత్రం ఇచ్చారు. గ్రామస్థులు సోంపల్లి అనిల్‌చౌదరి, వేలూరి రవీంద్ర, శ్రీనివాసులు, గంగాధర్, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి కల్పించాలని..

అనంతపురం క్లాక్‌టవర్: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులందరికీ పదోన్నతి కల్పించి సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ ఏర్పాటు చేయాలని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. జేఏసీ నాయకులు సుధాకర్, లక్ష్మీనారాయణ, ముత్యాలు, రాజు, వరప్రసాద్, మల్లికార్జునతదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని..

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కోరారు. వారు కార్మికులతో పాటు మంత్రి నారాయణను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకట నారాయణ, ముత్తాజా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అలాగే మున్సిపాలిటీలలో పనిచేసే కార్మికులందరికీ ఒకే వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ, మున్సిపల్ యూనియన్ నాయకులు రాజేష్‌గౌడ్, కృష్ణుడు, చిరంజీవి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లోనూ అభివృద్ధి

'తొలి అడుగులో' మంత్రి నారాయణ


వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులున్నా కూటమి ప్రభుత్వ పాలన రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన శుక్రవారం నగరంలోని 1వ డివిజన్ ఎర్రనేల కొట్టాల లో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌తో కలిసి మంత్రి ఇంటింటికీ తిరుగుతూ తొలి అడుగు కరపత్రాలు అందిస్తూ ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా తొలి అడుగు కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందన్నారు. పోలవరం, అమరావతి నిర్మాణాలతో రాష్ట్రం రూపురేఖలు మారుతాయన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ రాష్ట్రాభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు సీఎం చంద్రబాబునాయుడు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల అనేక సమస్యలు ఏర్పడినా ఏడాది కాలంలో వాటన్నింటిని అధిగమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మహిళలతో కలిసి విజయ సంకేతం చూపుతున్న మంత్రి

రెండు విభాగాలకు అధికారుల మార్పు

అనంతపురం రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో రెండు విభాగాలకు అధికారులను మార్చారు. ఆమేరకు శుక్రవారం సదరు అధికారులకు వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబుతో కలిసి ఉత్తర్వులను అందజేశారు. ఫైనాన్స్ ఆఫీసర్‌గా డాక్టర్ చింతా లోకేష్‌ను, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్‌కు శ్రీరాములు నాయక్‌ను నియమించారు.

తొలి అడుగులో వేగం పెంచండి: పరిటాల శ్రీరామ్


సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్


అనంతపురం క్రైం/ఆత్మకూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): సుపరిపాలన లో తొలిఅడుగు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సూచించారు. జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన ఆత్మకూరు మండల టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరుగుతున్న తీరును పోలింగ్ బూత్‌ల వారీగా ఆరా తీశారు. తర్వాత మాట్లాడుతూ.... ఈ కార్యక్రమం కొన్ని చోట్ల ఆశించిన మేరకు చురుగ్గా సాగడం లేదని, తక్కువగా నమోదు అవుతోందని అన్నారు. బూత్ ఇన్‌చార్జిలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కొందరి పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ అధిష్ఠానం ఆదేశం మేరకు తొలిఅడుగు కార్యక్రమాన్ని సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎవరూ నిర్లక్ష్యం చూపరాదని, బాధ్యతగా పనిచేయాలని అన్నారు. పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్‌తో పాటు బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలు, మండల నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి మహీంద్రా ఎక్స్‌యూవీ త్రీఎక్స్‌ఓ


ఎక్స్‌యూవీ త్రీఎక్స్‌ఓ కారును ఆవిష్కరిస్తున్నదృశ్యం

అనంతపురం రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మహీంద్రా ఎక్స్‌యూవీ త్రీఎక్స్‌ఓ ఆర్‌వీఎక్స్ కారు మార్కెట్‌లోకి విడుదలైంది. రుద్రంపేట సమీపంలోని ఎంజీబీ మొబైల్స్ మహీంద్ర షోరూంలో ఈ వాహనాన్ని ఎంజీబీ మొబైల్స్ సీఈఓ ఆదిత్య మాచాని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎక్స్‌యూవీ సెగ్మెంట్‌లో ఈ వాహనం విలక్షణమైన ఇంటీరియర్‌తో ఒక ట్రెండ్ సెట్టర్‌లా ఉంటుందన్నారు. డ్యూయల్ టోన్ బాడీ కలర్, బాడీ కలర్‌తో మ్యాచింగ్ చేసే ఫ్రంట్ గ్రిల్, బ్లాక్ వీల్ కవర్స్‌తో కూడిన ఆర్18స్టీల్ వీల్స్, ప్యానరమిక్ సన్‌రూఫ్, 16ఇంచెస్ బ్లాక్ అలాయ్ వీల్స్, నాలుగు వేరియంట్లు, ఐదు కలర్స్‌తో కారు లభిస్తుందన్నారు. వాహనం ఎక్స్ షోరూమ్ ధర రూ. 8.94లక్షల నుంచి ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

తెలుగు మహిళల సమావేశంలో మాజీ మేయర్


సమావేశంలో పాల్గొన్న మాజీ మేయర్ స్వరూప

అనంతపురం క్రైం, జూలై 18(ఆంధ్రజ్యోతి): మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన రాష్ట్ర తెలుగు మహిళల కార్యవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. ఇందులో తెలుగు మహిళా అనంతపురం జిల్లా అధ్యక్షురాలు, మాజీ మేయర్ స్వరూప స్వరూప పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్రఅధ్యక్షుడు పల్లాశ్రీనివాస్‌తో పాటు హోంమంత్రి మాట్లాడుతూ.. కష్టకాలంలో పార్టీ కోసం మహిళా నేతలు, కార్యకర్తలు ఎంతగానో శ్రమించారని చెప్పినట్టు ఆమె పేర్కొన్నారు. కష్టకాలంలో పనిచేసినోళ్లకు తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చినట్టు తెలిపారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు జిల్లాలో పార్టీ అభివృద్ధికి, మహిళ సంక్షేమానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు.

విషపు నీరు తాగి మేకల మృతి

రామగిరి, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకొండాపురంలో విషపునీరు తాగి 27 మేకలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన హరిజన గంగన్న, హరిజన పెద్దన్నకు చెందిన మేకలు శుక్రవారం మేపునకు వెళ్లి ఆ గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో మొక్కజొన్న పం టకు వదిలేందుకు సిద్ధంగా ఉంచిన క్రిమిసంహారక మందు కలిపిన నీటిని తాగాయి. దీంతో 27 మేకలు అక్కడిక్కడే మృతిచెందాయి. ఇంకా 5 మేకలు కొన ఊపిరితో ఉన్నాయి. పశువైద్యాధికారి మౌలాలిబాషా సిబ్బందితో వెళ్లి మృతిచెందిన మేకలకు పోస్టుమార్టం నిర్వహించారు. రూ.3.24లక్షలు నష్టం వచ్చి ఉంటుందని అంచనా వేశారు.

న్యూస్ బాక్స్

పాఠశాలల పనివేళల పెంపు తగదు

యాడికి, జూలై 18(ఆంధ్రజ్యోతి): మౌఖిక ఆదేశాలతో ప్రభుత్వ పాఠశాలల పనివేళల పెంపు తగదని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇలా పనివేళలను పెంచడం వల్ల దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడతారన్నారు.

వంటావార్పుతో కార్మికుల నిరసన

గుత్తి, జూలై 18(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో కార్మికులు వంటా వార్పు కార్యక్రమాన్ని చేపట్టి నిరసన తెలిపారు. ఈ సమ్మెకు వైసీపీ మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, పట్టణ, మండల కన్వీనర్లు మధుసూదన్‌రెడ్డి, గంగరాజు, కౌన్సిలర్లు సంఘీభావం తెలిపారు.

ఆర్డీటీ ఎఫ్‌ఆర్‌సీఏను రెన్యువల్ చేయండి



పోస్టుకార్డులతో విద్యార్థులు

కుందుర్పి, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సంస్థకు సంబంధించిన ఎస్‌సీఆర్‌ఏను కేంద్ర ప్రభుత్వం రెన్యువల్ చేయాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థి డీఎం నరసింహమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులతో పోస్ట్ కార్డులు ఉద్యమాన్ని శుక్రవారం చేపట్టారు. ఆర్డీటీ సంస్థకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటూ ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయించాలని కోరారు.

పోలీసులకు వైద్య పరీక్షలు

కళ్యాణదుర్గం, జూలై 18(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పోలీసులకు ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 250 మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో డీఎస్పీ రవికుమార్, పట్టణ సీఐ యువరాజ్, కళ్యాణదుర్గం రూరల్ సీఐ వంశీకృష్ణ, కళ్యాణదుర్గం సబ్ డివిజన్‌లోని ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

24న చౌడేశ్వరి దేవి అమ్మవారి జయంతి

ఉరవకొండ, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉరగాద్రి చౌడేశ్వరి దేవి అమ్మవారి జయంతి ఉత్సవాలను గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ శరత్ తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక ఆలయ ఆవరణంలో శుక్రవారం ఆవిష్కరించారు.

నేటి నుంచి పీ4 కుటుంబాల ఎంపికకు గ్రామసభలు

ఉరవకొండ, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా పీ4 కుటుంబాల ఎంపిక కోసం శనివారం నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ రవిప్రసాద్ శుక్రవారం తెలిపారు. 19న బూదగవి, వెల్లొండ, 23న రాయంపల్లి, నెరమెట్ల, 24న వ్యాసాపురం, నింబగల్లు 25న రేణుమాకుల పల్లి, చిన్న ముష్టూరు, 26న ఇంద్రావతి, పెద్దముష్టూరు, 29న మోపిడి, ఆమిద్యాల, 30 పెద్దకొకుంట్ల, రాకెంట్ల, 31న లత్తవరం, లత్తవరం తాండా, ఆగస్టు 2న షేక్షానుపల్లి, 5న ఉరవకొండలో గ్రామసభలు ఉంటాయన్నారు.

రికార్డుల తనిఖీ

యాడికి, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో సచివాలయం-4 పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రానికి సంబంధించిన రికార్డులను జాతీయ ఆరోగ్య మిషన్ డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసరెడ్డి శుక్రవారం తనిఖీచేశారు. సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో రికార్డుల నిర్వహణపై అవగాహన కల్పించారు. మాతా శిశుసంరక్షణ పథకంలో నమోదుచేసే వివరాలు కచ్చితమైనవిగా ఉండాలని, వివరాల నమోదులో తేడాలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీపీఓ కిషోర్‌కుమార్, ఎంఐఎస్ జరీనా, డాక్టర్ పరమేశ్వర్ పాల్గొన్నారు.

చెత్త సేకరణ..

పామిడి, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంకరాజుకాలువలో ఇంటింటి చెత్త సేకరణ, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు నిర్వహణ, మంచినీటి ట్యాంకులను జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు శుక్రవారం పరిశీలించారు. మంచినీటి సరఫరా, చెత్త సేకరణ, ఐవీఆర్ఎస్ కాల్స్‌పై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఉదయాన్నే విధులకు హాజరుకాని పంచాయతీ కార్యదర్శి రేఖకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ తేజోత్స్న, డిప్యూటీ ఎంపీడీఓ అశ్వర్థమనాయుడు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పామిడి, జూలై 18(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పోలింగ్ కేంద్రాల నుతహసీల్దార్ షర్మిల రెవెన్యూ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షించారు.

ఇంటర్ గ్రూప్ పోటీలకు అర్హత

రాయదుర్గంరూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): కర్నూల్‌లో త్వరలో నిర్వహించే ఇంటర్ గ్రూప్ పోటీల్లో పాల్గొనడానికి స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాండేట్లు వంశీ, ఆసి అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ శుక్రవారం తెలిపారు. రెండురోజుల క్రితం బ్రాహ్మణపల్లిలో జరిగిన ఇంటర్ గ్రూప్‌లో ఐదుగురు విద్యార్థులు పాల్గొనగా ఈ ఇద్దరు అర్హత సాధించినట్లు తెలిపారు.

కౌలుకు ఆలయ భూముల వేలం

కణేకల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడేగోళం గ్రామానికి చెందిన 33.5 ఎకరాల ఈశ్వర మాన్యాన్ని కౌలు కొరకు శుక్రవారం వేలం వేశారు. దేవాదాయశాఖ అధికారి దేవదాసు, పర్యవేక్షణ అధికారి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వేలం వేయగా 15 మంది రైతులు హాజరయ్యారు. రూ. 9,17,500 లకు భూములను కౌలుకు దక్కించుకున్నారు.

విద్యుత్ లోక్ అదాలత్

తాడిపత్రి, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని సీసీఓ సబ్‌డివిజన్ తరపున రిటైర్డ్ న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి, చైర్‌పర్సన్ మధుకుమార్, జనరల్ మేనేజర్ విజయలక్ష్మి నిర్వహించారు. చిన్న చిన్న సమస్యలతో పాటు అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పది సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ప్రభాకర్‌రావు, వసంతయ్య, నరసప్ప పాల్గొన్నారు.

డ్రైవర్ల వసతి గృహం .. జీబీసీ కార్యాలయం

విడపనకల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్థానిక జీబీసీ (గుంతకల్లు బ్రాంచ్ కెనాల్) కార్యాలయం పలు ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాల డ్రైవర్లకు ఒక లాడ్జిగా మారింది. జీబీసీ నీళ్లు వచ్చిన సమయంలో అప్పుడప్పుడు అధికారులు కార్యాలయానికి వచ్చి వెళ్తుంటారు. సాగు నీరు బంద్ అయిన తరువాత ఏ ఒక్క అధికారి కూడా ఈ కార్యాలయం వైపు తిరిగి చూడరు. ప్రస్తుతం విధుల్లో ఉన్న లస్కర్లు ఏ ఒక్కరూ ఇక్కడ కనిపించరు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి డ్రైవర్లు తమ వాహనాలను జీబీసీ కార్యాలయం ముందే ఉంచి... నిర్భయంగా క్లీన్ చేసుకొంటూ ఉంటారు. అయినా ఏ ఒక్కరూ వారి గురించి పట్టించుకోరు.




కార్యాలయ ఆవరణలో ఉన్న వాహనాలు, వాహనాన్ని క్లీన్ చేస్తున్న డ్రైవర్

సంక్షేమానికి 'జగనన్న' అడ్డు

- పేదలకు శాపంగా మారిన వైసీపీ రీ సర్వే
- ఎక్కువగా భూమి ఉన్నట్లు నమోదు
- తల్లికి వందనం పథకానికి దూరమైన అర్హులు



సమస్యను శెట్టూరు డిప్యూటీ తహసీల్దార్‌కు వివరిస్తున్న రాజన్న

బెళుగుప్ప/శెట్టూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అనాలోచిత చర్యల వల్ల పేదలు నేటికీ నష్టపోతూనే ఉన్నారు. పేద విద్యార్థులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకానికి జగనన్న రీ సర్వే అడ్డుగా నిలిచింది. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వే... పేదల పాలిట శాపంగా మారింది. నిబంధనల ప్రకారం రైతుకు పది ఎకరాలకు పైగా పొలముంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులు. బెళుగుప్ప మండలంలో గంగవరం సర్మస్‌వలీ ఐదు ఎకరాలు ఉండగా 222 ఎకరాలు ఉన్నట్లు, ఇదే గ్రామానికి చెందిన సింబిలి శ్రీకాంత్‌కు ఏడు ఎకరాలు ఉండగా 71 ఎకరాలు ఉన్నట్లు, గుండ్లపల్లిలో లక్ష్మీ రుద్రయ్యలకు మూడు ఎకరాలు ఉండగా 23 ఎకరాలు ఉన్నట్లు, నక్కలపల్లిలో సుదర్శనమ్మ, యర్రిస్వామిలకు మూడు ఎకరాలకు గాను 20 ఎకరాలు ఉన్నట్లు, చాకలి వెంకటేశులుకు మూడున్నర ఎకరాలు ఉండగా 25 ఎకరాలు ఉన్నట్లు నమోదైంది.ఇలా కేవలం గుండ్లపల్లిలో 50 మంది ఈ పథకానికి దూరమై లబోదిబోమంటున్నారు.

శెట్టూరు మండలం ములకలేడు గ్రామంలో జ్యోతి, రాజన్నకు ముగ్గురు పిల్లలు. వారు పాఠశాలలో చదువుకొంటున్నారు. అందులో ఓ పిల్లాడి ఆధార్ నెంబర్‌కు 5300 పట్టా నెంబర్లు, జెడ్ సోలార్ పార్కు హైదరాబాద్ లిమిటెడ్ భూమితో లింక్ అయింది. దీంతో ఆ ముగ్గురు విద్యార్థులకు తల్లికి వందనం పథకం అందలేదు. దీంతో తండ్రి రాజన్న తహసీల్దార్ కార్యాలయంలో పాటు కలెక్టరేట్ కూడా ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.

నా పేరుపై 228 ఎకరాలు ఉందట



మాకు ఇద్దరు కుమారులు. తల్లికి వందనం వర్తించకపోవడంతో అధికారులను సంప్రదించగా గంగవరంలోని మిగులు భూములు 228 ఎకరాలు నాపేరిట ఉందన్నారు. నాకు కాలువపల్లి గ్రామంలో ఐదు ఎకరాలు ఉంది. అధికారుల నిర్లక్ష్యం వద్ద తల్లికి వందనం డబ్బులు మంజూరుకాలేదు. న్యాయం చేసి ఆదుకోవాలి.

- శర్మస్ వలీ, గంగవరం, బెళుగుప్ప

అధికారుల తప్పిదం



రెవెన్యూ అధికారుల తప్పిదంతో మాకు తల్లికి వందనం పథకం దూరమైంది. నాకు ముగ్గురు పిల్లలు. అందులో ఓ కుమారుడి ఆధార్ నెంబర్‌పై భూములున్నట్లు నమోదు చేశారు. దీంతో తల్లికి వందనం పథకానికి దూరమయ్యాం. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది.

- రాజన్న, బాధితరైతు, శెట్టూరు

సమస్యను పరిష్కరిస్తాం

ఆధార్ నెంబర్లను పొరపాటుగా నమోదు చేయడంతో భూములు ఎక్కువగా ఉన్నట్లు ఆన్‌లైన్‌లో రికార్డు అయింది. దీన్ని జాయింట్ ఎల్‌పీఎం అంటారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

- అనిల్ కుమార్, తహసీల్దార్, బెళుగుప్ప

టీడీపీతోనే సంక్షేమం

గుంతకల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంపూర్ణ సంక్షేమం ఒక్క టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక 5, 6 వార్డుల్లో సూపరిపాలనలో తొలి అడుగు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసులు, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఫజులు, ఫ్రూట్ మస్తాన్, అంజి, హనుమంతు, రంగన్న, పెంచలపాడు వెంకటేశులు, వై సుధాకర్, మత్రునాయక్ పాల్గొన్నారు.

● పుట్లూరు : మండలంలోని శనగలగూడూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బాలరంగయ్య, నాయకులు సుదర్శన్‌నాయుడు, కులశేఖర్‌రెడ్డి, జీసీబాబు, గోవర్ధన్‌రాజు, సత్యంరెడ్డి, చెన్నారెడ్డి పాల్గొన్నారు.




గుంతకల్లులో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, శనగలగూడూరులో ఎమ్మెల్యే శ్రావణిశ్రీ ప్రచారం

దెబ్బతిన్న డ్రైనేజీలు .. రోడ్లపైనే మురుగు

కూడేరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. ప్రధాన వీధులు ముఖ్యంగా ఆంజనేయస్వామి ఆలయం వద్ద, కమ్మవారి వీధి, గ్రంథాలయం వద్ద మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో దుర్వాసన వస్తోందని, దోమలు అధికమై రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.





ఆంజనేయస్వామి ఆలయం వద్ద, కమ్మవారి వీధి మధ్యలో మురుగు, గ్రంథాలయ సమీపంలో దుస్థితి

రూ.1.6 కోట్లతో జీబీసీకి మరమ్మతులు

- 90 శాతం పనులు పూర్తి
- నెలాఖరుకు నీటి విడుదల..!

విడపనకల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు బ్రాంచ్ కాలువకు అధికారులు రూ. 1.60 కోట్లుతో మరమ్మతులు చేపట్టారు. జీరో బై జీరో వద్ద నుంచి 58వ కిలో మీటర్ వరకూ ప్యాచింగ్ పనులు, జంగిల్ క్లీయరెన్స్ తదితర పనులు చేపట్టారు. జీబీసీ పరిధిలోని ఐదు మండలాల్లో రైతులకు సాగు నీరు చిరి ఆయకట్టు వరకూ అందించేందుకు లీకేజీలు లేకుండా మరమ్మతులు చేపట్టారు. విడపనకల్లు, ఉరవకొండ, వజ్రకరూర్‌తో పాటు గుంతకల్లు, ఆలూరు కాలువకు సాగు నీరు అందిచే పనులు చేపట్టినట్లు జీబీసీ అధికారులు తెలిపారు. జూలై నెల చివరి వారంలో జీబీసీకి సాగు నీరు వచ్చే అవకాశం ఉండటంతో కాలువలోని మరమ్మతుల పనులు త్వరగా పూర్తి చేసేందుకు ఆయా కాలువలకు చెందిన అధ్యక్షులకు పనులు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ఈ పనులు దాదాపుగా 90శాతం పూర్తి అయ్యాయన్నారు. విడపనకల్లు జీబీసీ డీఈ మంజునాథ్ మాట్లాడుతూ.. జీబీసీ కాలువ ఆధునికీకరణ సమయంలో యూటీలు, అక్విడెట్‌లు, బ్రిడ్జిలు పనులు చేయకపోవటంతో సాగు నీరు కొంత వృథాగా అయ్యేదన్నారు. దీన్ని అరికట్టేందుకు ప్రభుత్వం కాలువ మరమ్మతులకు రూ. 1.60 కోట్లు మంజూరు చేసిందన్నారు. సాగు నీరు వచ్చే సమయానికి ఈ పనులు అన్నీ పూర్తి చేసి జీబీసీ ఆయకట్టు రైతులకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందిస్తామన్నారు.




జీబీసీకి రక్షణ గోడ నిర్మిసున్న కూలీలు, మరమ్మతు పూర్తయిన అక్విడెక్ట్



మంత్రితో శ్రీనివాసులు

సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయండి

పుట్లూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులాపురం, దోసలేడు గ్రామాలకు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను మండల టీడీపీ నాయకుడు శ్రీనివాసులునాయుడు కోరారు. విజయవాడలోని మంత్రి ఛాంబర్‌లో శుక్రవారం ఆయన్ను కలిశారు. ఈ గ్రామాల్లో లో ఓల్టేజీ కారణంగా వ్యవసాయానికి ఇబ్బందికరంగా మారిందన్నారు.

రేపు దూదేకుల సమావేశం

అనంతపురంవైద్యం, జూలై18(ఆంధ్రజ్యోతి): జిల్లా దూదేకుల ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికకు ఈ నెల 20న సమావేశాన్ని నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్, షెక్షావలి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. స్థానిక చమన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించే కార్యక్రమానికి జిల్లాలోని దూదేకుల ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

జాతీయ రహదారిలో భారీ గుంత

గుంతకల్లుటౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): నెల్లూరు - అంకోలా 63వ జాతీయ రహదారి గుంతకల్లు మీదుగా వెళ్తుంది. పట్టణంలోని బీరప్ప సర్కిల్ నుంచి బళ్లారి రైల్వే గేట్ వరకు ఉన్న ఈ రోడ్డు గుంతలమయమైంది. నిత్యం ఆర్టీసీ బస్సులు, లారీలు, ఆటోలు, స్కూల్ బస్సులు, ఇతర భారీ వాహనాలు వెళ్తుంటాయి. పట్టణంలోని బీరప్ప సర్కిల్‌లో ఈ రోడ్డుపై భారీ గుంత పడింది. రద్దీగా ఉంటే రోడ్డులోని గుంత వల్ల పలువురు వాహనదారులు గాయపడుతున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, పాదచారులు, స్థానికులు కోరుతున్నారు.



బీరప్ప సర్కిల్ రహదారిపై గుంత

చెట్ల మధ్యలో విద్యుత్ స్తంభాలు

నిబంధనలు పాటించని కాంట్రాక్టర్లు

కూడేరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలో అనంతపురం - బళ్లారి ప్రధాన రహదారి పక్కన పెరిగిన చెట్ల మధ్యన నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. అనంతపురం రూరల్ మండలం తాడిచెర్ల సబ్‌స్టేషన్ నుంచి కూడేరు సబ్ స్టేషన్‌కు 33 కెవీ లైన్ ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. కూడేరు మండలంలో వ్యవసాయానికి తొమ్మిది గంటల కరెంటు సరఫరా చేయడానికి అవసరమైన పనులు చేస్తున్నారు. అయితే ప్రధాన రహదారికి ఇరువైపులా పెంచిన చెట్లు మధ్యన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని చోట్ల చెట్లను కొట్టేసి మరీ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డుకు దూరంగా ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ స్తంభాలను .. రోడ్డు పక్కనే చెట్ల మధ్యలో ఏర్పాటు చేస్తున్నారు. దీనిపై నేషనల్ హైవే ఏఈ కుళ్లాయిరెడ్డిని వివరణ కోరగా.. చెట్ల మధ్యలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయరాదని కొన్ని రోజుల క్రితం విద్యుత్ శాఖ అధికారులకు సూచించామని, అయినా కాంట్రాక్టర్లు ఆ పనులు అలాగే కొనసాగిస్తున్నారని, దీనిపై ట్రాన్స్ కో అధికారులకు ఇక లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



చెట్ల మధ్యలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు



క్రైం న్యూస్ ..

విద్యుదాఘాతంతో మేస్త్రీ మృతి



ఇస్మాయిల్ మృతదేహం

రాయదుర్గంరూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గుమ్మఘట్ట మండలం కలుగోడు గ్రామానికి చెందిన మేస్త్రీ ఇస్మాయిల్ (35) పట్టణంలోని కోట ఏరియాలో ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నాడు. శుక్రవారం ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా.. విద్యుత్‌తీగలు తగలడంతో షాక్‌కు గురై కిందకు పడ్డాడు. తోటి కూలీలు అతన్ని వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. ఇస్మాయిల్‌కు భార్య హర్షిత్‌భాను, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

మహిళకు తీవ్ర గాయాలు

గుంతకల్లుటౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): పెద్దవడుగూరు మండలం మామిళ్లపల్లి గ్రామానికి చెందిన సుంకురత్న మండలంలోని గొల్లలదొడ్డిలో వేరుశనగ పంట కొతకు శుక్రవారం వచ్చింది. వేరుశనగ పంటను నూర్పిడి యంత్రంలో వేస్తున్న సమయంలో ప్రమాదశవశాత్తు సుంకురత్న చేయి ఆ యంత్రంలో పెట్టడంతో తీవ్రంగా గాయపడింది. ఆమెను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చెట్టును ఢీకొన్న కారు



వజ్రకరూరు (ఉరవకొండ), జూలై 18(ఆంధ్రజ్యోతి): యాడికి మండలం రాయలచెరువుకు చెందిన సతీష్ గురువారం రాత్రి రాయదుర్గంకు కారులో బయలుదేరాడు. వజ్రకరూరు మండలం ప్యాపిలి సమీపంలో మలుపు వద్ద జింకల మంద అడ్డం రావడంతో వాటిని తప్పించే క్రమంలో అదుపు తప్పి కారు చెట్టును ఢీకొనింది. దీంతో చెట్టు విరిగి కారుమీద పడింది. కారులో ఉన్న సతీష్‌కు వ్యక్తి స్వల్పగాయాలయ్యాయి. అతన్ని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

జింక మృతి

విడపనకల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కొట్టాలపల్లి గ్రామం వద్ద శుక్రవారం సాయంత్రం కుక్కల దాడిలో ఓ జింక మరణించింది. బళ్లారి-అనంతపురం 42వ జాతీయ రహదారి పక్కన పొలంలో కుక్కలు జింకల మందపై దాడి చేశాయి. ఈ దాడిలో ఒక జింక అక్కడిక్కడే మరణించింది. దీన్ని గమనించిన వాహనాదారులు ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు జింక కళేబరానికి పోస్టుమార్టం చేసి ఖననం చేశారు.

పాలవాయి పాఠశాలకు రూ. 50 లక్షలు

సొంత నిధులతో నిర్మాణాన్ని పూర్తి చేయిస్తాం : ఎమ్మెల్యే అమిలినేని



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు

కళ్యాణదుర్గం, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలవాయి పాఠశాలలో తరగతి గదులు నిర్మాణాలు ఆగిపోయాయని, ఎస్ఆర్‌సీ ట్రస్ట్ ద్వారా రూ.50 లక్షలు తన సొంత నిధులతో మూడు నెలల్లో ఆ నిర్మాణాలను పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రజావేదికలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.50 లక్షలను మూడు రోజుల్లోనే ఆ పాఠశాల అకౌంట్‌కు జమ చేస్తామని తెలిపారు. దీంతో ఎమ్మెల్యేను ఉపాధ్యాయులు, గ్రామస్థులు సన్మానించారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా తలారి మస్తానప్ప



ఎమ్మెల్యే గుమ్మనూరుతో తలారి మస్తానప్ప

గుంతకల్లు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ (పీఏసీఎస్) అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన తలారి మస్తానప్ప ఎంపికయ్యారు. మాజీ ఎంపీటీసీ అయిన మస్తానప్ప 2001లో వైటీ చెరువు మండల ప్రాదేశిక నియోజకవర్గం నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ సీనియర్ నాయకుడిగా, పార్టీ పట్టణాధ్యక్షుడిగా, వాల్మీకి సాధికార సమితి జిల్లా అధ్యక్షుడిగా పదవులను పొందారు. తనపై నమ్మకం ఉంచి గుంతకల్లు ప్రైమరీ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీ చైర్మన్‌గా పదవిని ఇచ్చిన పార్టీ అధిష్టానానికి, సిఫారసు చేసిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరుడు నారాయణ స్వామికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

వీకే ఆదినారాయణరెడ్డికి ఘన నివాళి

యాడికి, జూలై 18(ఆంధ్రజ్యోతి): గుత్తి మాజీ ఎమ్మెల్యే, మండలంలో వేములపాడుకు చెందిన సీపీఐ నేత దివంగత వీకే ఆదినారాయణరెడ్డి 28వ వర్ధంతి సందర్భంగా యాడికిలో ఆయన చిత్రపటానికి శుక్రవారం పలువురు నివాళులర్పించారు. ఇందులో సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి జూటూరు రఫీ, నాయకులు శ్రీరాములు, వెంకటరాముడుయాదవ్, జూటూరు రజాక్, ఓబులరెడ్డి, వీకే ప్రదీప్ ఎరెడ్డి, కుళ్లాయిరెడ్డి, బషీర్, గరిడి శివన్న పాల్గొన్నారు.

● తాడిపత్రి: స్థానిక రంగప్పకాలనీలో వీకే ఆదినారాయణరెడ్డి చిత్రపటం వద్ద సీపీఐ నాయకులు నాగరంగయ్య, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, నారాయణరెడ్డి, నాగార్జున నివాళులర్పించారు.

● పెద్దవడుగూరు : స్థానిక సీపీఐ కార్యాలయంలో వీకే ఆదినారాయణరెడ్డి చిత్రపటం వద్ద నాయకులు సుధాకర్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, నాగేంద్ర తదితరులు నివాళులర్పించారు.

ఏఎంసీ చైర్మన్‌కు ఘన సన్మానం



ఏఎంసీ చైర్మన్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

గుత్తి, జూలై 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ నూతన చైర్మన్, జక్కలచెరువు గ్రామ వాసి గుర్రాల సూర్యప్రతాప్‌నాయుడిని స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పలువురు సన్మానించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, న్యాయవాది సోమశేఖర్, నాయకులు చికెన్ శ్రీనివాసులు, ఎండీ రియాజ్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, బీమానాగరాజు, రమేష్, మల్లికార్జున, శ్రీదేవి, సుంకన్న సన్మానించిన వారిలో ఉన్నారు.

విషపు నీరు తాగి 27 మేకల మృతి

రామగిరి, జూలై 18(ఆంధ్రజ్యోతి):మండలంలోని పెద్దకొండాపురంలో విషపునీరు తాగి 27 మేకలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన హరిజన గంగన్న, హరిజన పెద్దన్నకు చెందిన మేక లు శుక్రవారం మేపునకు వెళ్లి ఆ గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో మొక్కజొన్న పంటకు వదిలేందుకు సిద్ధంగా ఉంచిన క్రిమిసంహారక మందు కలిపిన నీటిని తాగాయి. దీంతో 27 మేకలు అక్కడిక్కడే మృతి చెందాయి. పశువైద్యాధికారి మౌలాలిబాషా సిబ్బందితో వెళ్లి మృతి చెందిన మేకలకు పోస్టమార్టం నిర్వహించారు.